DD9 వాస్తవాలు పలుకు
# వార్త
తెలుగు దినపత్రిక
TGTEL/26/A2635

హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 123 | 13-09-2026 | ఆదివారం | పేజీలు: 10 | వెల: 3/-

# అధికారంలో ఉంటే సెక్రెటేరియట్‌కు రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు

కేసీఆర్‌కు చట్టసభలపై ఎంత గౌరవమో అర్థమవుతోంది
ఫాంహౌస్‌లో ఎల్పీ మీటింగ్.. పార్టీ ఆఫీస్‌లో మాక్ అసెంబ్లీ
ఉన్న దగ్గరకే అన్నీ రావాలనుకోవడం దొరల అహంకారం
అధికారం పోయినా బీఆర్ఎస్ అహంకారం పోలేదు
స్పీకర్, చట్టసభలను అవమానిస్తే ప్రజలు శిక్షిస్తారు
'చింత చచ్చినా పులుపు చావలేదు'.. సీతక్క ఘాటు వ్యాఖ్యలు
బీఆర్ఎస్ వైఖరికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారు


2

## ఆదిలాబాద్ విమానాశ్రయం
# వేగవంతం

ఆదిలాబాద్ విమానాశ్రయానికి అడుగులు వేగం
కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అమలుకు కీలక ముందడుగు
రాజ్‌నాథ్, రామ్మోహన్ నాయుడుతో కిషన్‌రెడ్డి భేటీ
జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్
ఏర్పాటుకు రక్షణ శాఖ సుముఖత
ప్రాజెక్టు పురోగతిపై కేంద్ర మంత్రులతో సమీక్ష
వచ్చే వారంలో ముగ్గురు నోడల్ అధికారుల నియామకం
డీపీఆర్, మాస్టర్‌ప్లాన్ రూపకల్పన వేగవంతం

**డీడీ9 వార్త, హైదరాబాద్**

ఆదిలాబాద్ విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో శనివారం సమావేశమైనట్లు వెల్లడించారు. సమావేశంలో ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించినట్లు తెలిపారు.

**వచ్చే వారంలో నోడల్ అధికారుల నియామకం**

జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు అమలును మరింత వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం తరపున ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని

మిగతా 7లో..



## హైదరాబాద్‌ను బ్లూ, గ్రీన్ సిటీగా
# తీర్చిదిద్దుతాం

### 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని క్యూర్ చట్టం

నగర రవాణాకు కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్
మూసీ తొలిదశకు
రూ.7,345.12 కోట్లతో అనుమతులు
20 టీఎంసీల గోదావరి
జలాల తరలింపునకు చర్యలు
జీహెచ్ఎంసీని
మూడు కార్పొరేషన్లుగా విభజించాం
అన్ని సంస్థల సమన్వయానికి
చట్టబద్ధ వ్యవస్థ
సీఎం అధ్యక్షతన క్యూర్
అత్యున్నత పాలకమండలి
మురుగునీటిని శుద్ధి చేసి
పచ్చదనానికి వినియోగం
2034 నాటికి ట్రిలియన్
డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
ప్రపంచ నగరాలతో పోటీపడేలా
హైదరాబాద్ అభివృద్ధి



**డీడీ9 వార్త, హైదరాబాద్**

హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. నగర విస్తరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో రాబోయే 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమర్థమైన పాలన అందించేందుకు కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ (క్యూర్) చట్టాన్ని రూపొందించామని చెప్పారు. తెలంగాణ శాసనసభలో క్యూర్ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి మాట్లాడారు.

**సమగ్ర రవాణా ప్రణాళిక**

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ రూపొందించామని శ్రీధర్‌బాబు తెలిపారు. నగరం పెద్దఎత్తున విస్తరిస్తున్నందున భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాలనా వ్యవస్థను కూడా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా

మిగతా 7లో..



బీఎస్పీ వారసత్వంలో మాయావతి
## ఊహించని ట్విస్ట్..

కుటుంబ పాలనకు నో..
వారసత్వ రాజకీయాలకు చెక్
సోదరుడి కుమారులకు
రాజకీయ బాధ్యతలు లేవంటూ
మాయావతి స్పష్టత
దీపికా ఆనంద్‌కు కీలక
బాధ్యతలపై సంకేతాలు
న్యాయవిద్య చదువుతున్న
దీపికాపై మాయావతి ఫోకస్
BSPలో కొత్త రాజకీయ
వారసత్వంపై ఆసక్తికర చర్చ
కుటుంబానికి ఒక న్యాయం..
పార్టీలో మరో వ్యూహమా?

**డీడీ9 వార్త, నేషనల్‌బ్యూరో**

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో బహుజన్ సమాజ్ పార్టీ (BSP) అధినేత్రి మాయావతి మరోసారి సంచలన నిర్ణయంతో రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేశారు. పార్టీలో కుటుంబ పాలనకు తావులేదని నినదిస్తూనే.. తన సోదరుడు ఆనంద్ కుమార్ కుమారులను రాజకీయ బాధ్యతలకు శాశ్వతంగా దూరం పెడుతున్నట్లు కుండబద్దలు కొట్టారు. అదే సమయంలో ఆయన కుమార్తె, న్యాయవిద్య అభ్యసిస్తున్న కుమారి దీపికా ఆనంద్‌కు కీలక బాధ్యతలు

మిగతా 7లో..

# భారత్, చైనా కలిసి సాగాలి

మోదీతో జిన్‌పింగ్ భేటీ..
ఢిల్లీలో మోదీ, జిన్‌పింగ్ ద్వైపాక్షిక చర్చలు
ఇరు దేశాల సంబంధాలపై
కీలక అంశాల ప్రస్తావన
భారత్, చైనా కలిసి నడవాలని
జిన్‌పింగ్ పిలుపు
ఆధునిక సాంకేతికతతో వేగంగా
పురోగతి సాధిద్దామని వ్యాఖ్య
పరస్పర సామర్థ్యాల
నుంచి నేర్చుకోవాలని సూచన
దీర్ఘకాలిక, వ్యూహాత్మక
ఒప్పందాలకు చైనా సిద్ధం
మోదీని ఇప్పటివరకు
21 సార్లు కలిశానన్న జిన్‌పింగ్
భారత్‌చైనా సంబంధాలు స్థిరమైన
అభివృద్ధి దిశలో ఉన్నాయని వ్యాఖ్య
బ్రిక్స్ సదస్సుకు చైనా
సహకారంపై మోదీ కృతజ్ఞతలు
ద్వైపాక్షిక సహకారంపై
విస్తృతంగా చర్చించిన ఇరువురు



**డీడీ9 వార్త, నేషనల్‌బ్యూరో**

ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ఇరువురు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. అనంతరం ఇరు దేశాల తరపున ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

**కలిసి ముందుకు సాగాలి**

ప్రపంచంలోని అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి ముందుకు సాగాలని జిన్‌పింగ్ ఆకాంక్షించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని ఇరు దేశాలు వేగంగా పురోగతి

మిగతా 7లో..

# ప్రజల ఆస్తులను పరిరక్షిస్తాం

రెవెన్యూ సంస్కరణల లక్ష్యం
ప్రజల ఆస్తుల పరిరక్షణే
ధరణితో గత పాలకులు
భూముల అక్రమాలు
స్వప్రయోజనాలకు
లక్షలాది ఎకరాలు
అర్ధరాత్రి వేళల్లోనూ
రిజిస్ట్రేషన్లు జరిగాయి
ధరణి తప్పిదాలతో రైతులు
కార్యాలయాల చుట్టూ తిరిగారు
భూమి లేకుండానే
పాసుపుస్తకాలు ఇచ్చారు
నకిలీ పట్టాలతో రైతుబంధు
నిధులు దుర్వినియోగమయ్యాయి
125 ఏళ్ల తర్వాత
సమగ్ర భూసర్వే చేపట్టాం
ఇప్పటివరకు 5 లక్షలకు
పైగా దరఖాస్తుల పరిష్కారం
భూభారతిలో 80 మాడ్యూల్స్‌కు
బదులు 5 మాత్రమే
47,440 ఎకరాలను
22ఏ నిషేధిత జాబితా
నుంచి తొలగించాం




**డీడీ9 వార్త, హైదరాబాద్**

ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని భూముల వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా గత పాలకుల భూ వ్యవహారాల బండారం బయటపడుతుండటంతోనే వారు సభకు రాకుండా మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్నారని విమర్శించారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో

మిగతా 7లో..

## 80ల నాటి
# ఫొటోలతో జాగ్రత్త

సైబర్ మోసాలు జరిగే అవకాశం
1980ల నాటి
ఫొటోలుగా మార్చే ట్రెండ్ వైరల్
సోషల్ మీడియా
ప్రకటనలతో సైబర్ నేరగాళ్ల వల
ఉచితంగా ఎడిటింగ్
చేస్తామంటూ ఆకర్షించే అవకాశం
అనుమానాస్పద
లింకులపై క్లిక్ చేస్తే ప్రమాదం
ఎస్ఎంఎస్, ఓటీపీ
వివరాలు తస్కరించే ముప్పు
కాంటాక్టులు, వ్యక్తిగత
సమాచారానికీ భద్రత కరువు
బ్యాంకింగ్, ఆర్థిక
సమాచారంపై నేరగాళ్ల కన్ను
ఆర్థిక మోసాలు, గుర్తింపు
దుర్వినియోగానికి అవకాశం
అప్రమత్తంగా ఉండాలని
సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచన




**డీడీ9 వార్త, హైదరాబాద్**

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన 1980ల నాటి రెట్రో ఫొటో ఎడిటింగ్ ట్రెండ్‌ను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ హెచ్చరించారు. సాధారణ ఫొటోలను 1980ల నాటి రెట్రో ఫొటోలుగా మార్చుతామంటూ సోషల్ మీడియా ప్రకటనలు, సందేశాల ద్వారా ప్రజలను ఆకర్షించే అవకాశం

మిగతా 7లో..

# మోహన్‌లాల్, విజయ్ కంటే నేనే మంచి డ్యాన్సర్



తన డ్యాన్స్‌తో ఉన్న ఏఐ వీడియో
చూసి ఆశ్చర్యపోయానన్న కేరళ సీఎం
మోహన్‌లాల్, విజయ్ కంటే తానే
బాగా డ్యాన్స్ చేశానని సరదా వ్యాఖ్య
కేరళలో విద్యుత్ సంక్షోభంపై విమర్శల
నడుమ వైరల్ అయిన వీడియో
వినోదం కోసమేనని, ఎవరినీ
కించపరచలేదని స్పష్టం చేసిన క్రియేటర్లు
డిజిటల్ టెక్నాలజీ సవాళ్లపై జరిగిన
సెమినార్లో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు

**డీడీ9 వార్త, నేషనల్‌బ్యూరో**

కేఎస్ఈబీ ఉద్యోగులతో కలిసి తాను నృత్యం చేస్తున్నట్లుగా ఉన్న ఒక కృత్రిమ మేధ (ఏఐ) వీడియోను చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అన్నారు. అయితే, ఆ టెక్నాలజీ పుణ్యమా అని తాను ప్రముఖ నటులు మోహన్‌లాల్, సీఎం విజయ్ కంటే మెరుగ్గా డ్యాన్స్ చేశానని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు.

శనివారం కేరళ జ్యుడీషియల్ అకాడమీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో సతీశన్

మిగతా 7లో..

# ఢిల్లీ డిక్లరేషన్‌కు బ్రిక్స్ దేశాల ఆమోదం

ఏకతాటిపైకి వచ్చిన బ్రిక్స్ దేశాలు
ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా సమ్మతి
భారత్ దౌత్య నైపుణ్యంతో కీలక ఏకాభిప్రాయం
ఏకపక్ష సుంకాల విధింపుపై ఆందోళన
అంతర్జాతీయ చట్టాలకు
విరుద్ధమైన చర్యలకు వ్యతిరేకత
చర్చలు, దౌత్యంతో
వివాదాల పరిష్కారానికి పిలుపు
అణ్వాయుధాలు, సంఘర్షణల ముప్పుపై చర్చ
అంతర్జాతీయ శాంతి, స్థిరత్వానికి కట్టుబాటు
తీవ్రవాదాన్ని అన్ని రూపాల్లో ఖండించిన నేతలు
పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్ దేశాలు



2

# ప్రజల ఆస్తులను పరిరక్షిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

జరిగిన స్వల్పకాలిక చర్చలో మంత్రి మాట్లాడారు.

**ధరణితో భూముల అక్రమాలు**

తెలంగాణను పోరాడి సాధించుకున్నప్పటికీ గత పాలకులు రాష్ట్రాన్ని స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూ శాఖను తన వద్దే ఉంచుకుని భూముల వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా భావించారని అన్నారు.

ధరణి పోర్టల్ నిర్వహణను దివాళా తీసిన విదేశీ సంస్థకు అప్పగించారని, పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకుని అర్ధరాత్రి వేళల్లోనూ రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపించారు. పోర్టల్‌లో చోటుచేసుకున్న తప్పుల కారణంగా లక్షలాది మంది రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందన్నారు. ఈ వ్యవస్థ కారణంగా వందలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.

**5 లక్షలకు పైగా దరఖాస్తుల పరిష్కారం**

రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవని మంత్రి తెలిపారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని చెప్పారు. ధరణి అమల్లో ఉన్నప్పుడు 2.49 లక్షల దరఖాస్తులు ఉండగా.. భూభారతి అమల్లోకి వచ్చిన తర్వాత మరో 3 లక్షల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. మొత్తం 5 లక్షలకు పైగా దరఖాస్తులను పరిష్కరించామని తెలిపారు.

పరిష్కరించలేని దరఖాస్తులను ఏ కారణంతో పరిష్కరించలేదో కూడా స్పష్టంగా తెలియజేశామని అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో భూముల సర్వే పూర్తిచేసి రైతులకు పాసుపుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. మరో ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పూర్తి చేసి రైతులకు మేలు చేస్తామని హామీ ఇచ్చారు.

**భూమి లేకుండానే పాసుపుస్తకాలా?**

గత పాలనలో భూములు లేకపోయినా పాసుపుస్తకాలు ఇచ్చారని పొంగులేటి ఆరోపించారు. ధరణి చట్టాన్ని తీసుకొచ్చి రాజకీయ అనుచరులు, బంధువులకు పాసుపుస్తకాలు ఇచ్చారని విమర్శించారు. భూమి లేని వారికి సైతం రైతుబంధు అందించి వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. నల్గొండ జిల్లాలో 14 వేల ఎకరాల్లో సర్వే నిర్వహిస్తే 4 వేల ఎకరాలకు దొంగపట్టాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ధరణిలో 80 మాడ్యూల్స్ ఏర్పాటు చేసి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని, భూభారతి చట్టంలో వాటి సంఖ్యను కేవలం ఐదుకు తగ్గించామని వివరించారు.

**22ఏపై బీఆర్‌ఎస్‌ను నిలదీత**

25 వేల ఇళ్లు నిషేధిత జాబితాలో ఉన్న మాట వాస్తవమేనని మంత్రి తెలిపారు. కొన్ని దశాబ్దాల క్రితం అసైన్డ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారు ఉన్నారని చెప్పారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం అసైన్డ్ భూములు ఇచ్చిందన్నారు.

అసైన్డ్ భూములు ఉమ్మడి రాష్ట్రం నుంచే నిషేధిత జాబితాలో ఉన్నాయని, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. అసైన్డ్ భూముల విషయంలో ఏం చేయాలో సలహాలు ఇవ్వాలని కోరారు.

**47,440 ఎకరాలు 22ఏ నుంచి తొలగింపు**

ఆగస్టు 31 నాటికి రాష్ట్రంలో మొత్తం 1,02,05,250 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని పొంగులేటి తెలిపారు. ఇందులో 96,36,777 ఎకరాలు ప్రభుత్వ వ్యవసాయ భూములు, 3,73,930 ఎకరాలు ప్రైవేటు వ్యవసాయ భూములు, 1,94,543 ఎకరాలు వ్యవసాయేతర భూములు, 5,12,792 ఎకరాలు ఎండోమెంట్ భూములు ఉన్నాయని వివరించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటితో పోలిస్తే ప్రస్తుతం నిషేధిత జాబితాలోని భూములు 47,440 ఎకరాలు తగ్గాయని చెప్పారు. ఇందులో 23 వేల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పాత జీవోల్లోని తప్పులను గుర్తించి మరో 20 వేల ఎకరాలను తొలగించామని వివరించారు. 22ఏ నుంచి తొలగించిన మొత్తం 47,440 ఎకరాలకు సంబంధించిన లెక్కలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు.

అయితే బీఆర్‌ఎస్ హయాంలో తొలగించిన 23 వేల ఎకరాలకు లెక్కలు లేవని కమిటీ పేర్కొందని మంత్రి అన్నారు. భువనగిరిలో 25 వేల ఇళ్లు 22ఏలో ఉన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పిన విషయం ప్రస్తావిస్తూ.. అవన్నీ అసైన్డ్ భూముల్లో ఉన్న ఇళ్లేనని వివరించారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని రాందాస్‌పల్లిలో 1,300 ఎకరాలపై హరీశ్‌రావు మాట్లాడారని, ఆ భూమి దశాబ్దాలుగా నిషేధిత జాబితాలోనే ఉందని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పట్లో ఈ సమస్యను ఎందుకు పరిష్కరించలేదని పొంగులేటి ప్రశ్నించారు.




# మోహన్‌లాల్, విజయ్ కంటే నేనే మంచి డ్యాన్సర్

**మొదటిపేజీ తరువాయి**

ప్రసంగించారు. సినిమా, సంగీత రంగాల్లో కాపీరైట్ హక్కుల పరిరక్షణ, డిజిటల్ టెక్నాలజీ సవాళ్లు అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తన అనుభవాన్నే ఉదాహరణగా చూపుతూ, "ఆ వీడియో చూసి నేను షాక్ అయ్యాను. అందులో నేను మోహన్‌లాల్, విజయ్ కంటే బాగా డ్యాన్స్ చేస్తున్నట్లు అనిపించింది" అని సాంకేతిక పరిజ్ఞాన వేగానికి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ప్రస్తుతం కేరళ తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న సమయంలో ఈ ఏఐ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇటీవల విడుదలైన 'జైలర్ 2' చిత్రంలోని 'అల బొలెలో' పాటకు సతీశన్, కేఎస్‌ఈబీ ఉద్యోగులు డ్యాన్స్ చేస్తున్నట్లు ఈ వీడియోను రూపొందించారు. కేవలం వినోదం కోసమే దీనిని రూపొందించామని, ఎవరినీ అవమానించే ఉద్దేశం లేదని క్రియేటర్లు స్పష్టం చేశారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియోను కోటి మందికి పైగా వీక్షించడం విశేషం.

ఈ వీడియోపై నెటిజన్లు స్పందిస్తూ విద్యుత్ కోతలపై ప్రభుత్వంపై, కేఎస్‌ఈబీపై విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి అతీంద్రియ శక్తులేమీ కారణం కాదని, రాత్రిపూట వినియోగం పెరగడమే ప్రధాన కారణమని మంత్రి సన్నీ జోసెఫ్ పేర్కొన్న తరుణంలో సతీశన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.




# హైదరాబాద్‌ను బ్లూ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతాం

**మొదటిపేజీ తరువాయి**

విభజించామని, నగరంలోని అన్ని ప్రభుత్వ సంస్థలు సమన్వయంతో పనిచేసేలా చట్టబద్ధ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలకమండలిని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

**మూసీ పునరుజ్జీవానికి భారీ నిధులు**

మూసీ పునరుజ్జీవం తొలిదశ పనులకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. నగర భవిష్యత్ అవసరాలను తీర్చేందుకు 20 టీఎంసీల గోదావరి జలాలను తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు.

మురుగునీటిని శుద్ధి చేసి చెట్ల పెంపకం, కాలుష్య నియంత్రణకు వినియోగించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణతో పాటు జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంపై దృష్టి పెట్టామని తెలిపారు.

**ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ**

తెలంగాణ రైజింగ్ 2047 పాలసీతో ప్రభుత్వం ముందుకెళ్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. 2034 నాటికి రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలని ఆకాంక్షించారు. పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించే స్థాయికి హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగర గత వైభవాన్ని కాపాడుకుంటూనే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**400 రకాల నేరాల తొలగింపు**

తెలంగాణ ప్రజా విశ్వాసం నిబంధనల సవరణ చట్టం బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో చిన్నపాటి సాంకేతికపరమైన సుమారు 400 రకాల నేరాలను నేరపూరిత పరిధి నుంచి తొలగించే ఉద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెట్టినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. ఈచట్టంఅమలుతోవ్యాపారనిర్వహణమరింతసులభతరం అవుతుందని చెప్పారు. చిన్నపాటి కేసుల కారణంగా అనేక సందర్భాల్లో చిన్న వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ చట్టం రాష్ట్రంలో అందరికీ ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్టంలోని నిబంధనలపై కలెక్టర్లు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# భారత్, చైనా కలిసి సాగాలి

**మొదటిపేజీ తరువాయి**

సాధించగలవని అన్నారు.

ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకునేందుకు చైనా సిద్ధంగా ఉందని జిన్‌పింగ్ తెలిపారు.

**మోదీని 21 సార్లు కలిశా**

బ్రిక్స్ సదస్సుకు సంబంధించి తన పుట్టిన రోజునే భారత్ నుంచి ఆహ్వానం అందిందని జిన్‌పింగ్ గుర్తుచేశారు. ప్రధాని మోదీని ఇప్పటివరకు 21 సార్లు కలిశానని తెలిపారు.

ఇరు దేశాల మధ్య సంబంధాలను స్థిరమైన అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేశామని జిన్‌పింగ్ పేర్కొన్నారు. భారత్, చైనా మధ్య పరస్పర సహకారం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని అన్నారు.

**చైనా సహకారానికి మోదీ కృతజ్ఞతలు**

భారత్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్ సదస్సుకు చైనా అందిస్తున్న మద్దతు, సహకారానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ద్వైపాక్షిక సహకారంపై చర్చించేందుకు జిన్‌పింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందన్నారు.

ఇరు దేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించినట్లు మోదీ తెలిపారు. బ్రిక్స్ వేదికగా భారత్, చైనా సహకారం మరింత విస్తరించే అవకాశాలపైనా ఇరువురు నేతలు దృష్టి సారించారు.

# 80ల నాటి ఫొటోలతో జాగ్రత్త

**మొదటిపేజీ తరువాయి**




ఉందని తెలిపారు. ఉచితంగా లేదా అపరిమితంగా ఫొటో ఎడిటింగ్ సదుపాయం కల్పిస్తామంటూ నమ్మబలికి అనుమానాస్పద లింకులను పంపే అవకాశం ఉందని శిఖా గోయల్ పేర్కొన్నారు. అలాంటి లింకులపై క్లిక్ చేసి ఫైళ్లను డౌన్‌లోడ్ చేస్తే సైబర్ నేరగాళ్ల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా ఏపీకే ఫైళ్ల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు.

ఇలాంటి మోసాల ద్వారా మొబైల్‌లో భద్రపరిచిన ఎస్ ఎంఎస్, ఓటీపీలు, కాంటాక్టులు, బ్యాంకింగ్ వివరాలు, ఆర్థిక సమాచారం, వ్యక్తిగత సమాచారంతో పాటు ఇతర సున్నితమైన డేటాను నిందితులు దొంగిలించే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఆర్థిక మోసాలు, అనధికారిక లావాదేవీలు, గుర్తింపు దుర్వినియోగం వంటి సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎంఎస్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని శిఖా గోయల్ సూచించారు. రెట్రో ఫొటో ఎడిటింగ్ పేరుతో వచ్చే ఆఫర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎవరైనా ఇలాంటి సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

# ఢిల్లీ డిక్లరేషన్‌కు బ్రిక్స్ దేశాల ఆమోదం

- **ఏకతాటిపైకి వచ్చిన బ్రిక్స్ దేశాలు**
- **ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా సమ్మతి**
- **భారత్ దౌత్య నైపుణ్యంతో కీలక ఏకాభిప్రాయం**
- **ఏకపక్ష సుంకాల విధింపుపై ఆందోళన**
- **అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైన చర్యలకు వ్యతిరేకత**
- **చర్చలు, దౌత్యంతో వివాదాల పరిష్కారానికి పిలుపు**
- **అణ్వాయుధాలు, సంఘర్షణల ముప్పుపై చర్చ**
- **అంతర్జాతీయ శాంతి, స్థిరత్వానికి కట్టుబాటు**
- **తీవ్రవాదాన్ని అన్ని రూపాల్లో ఖండించిన నేతలు**
- **పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్ దేశాలు**

**డీడీ9 వార్త, నేషనల్‌బ్యూరో**

దిల్లీ డిక్లరేషన్‌కు బ్రిక్స్ దేశాలు ఆమోదం తెలిపాయి. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య విభేదాలు ఉన్నప్పటికీ.. ఇరుదేశాలతో పాటు సౌదీ అరేబియా కూడా డిక్లరేషన్‌కు అంగీకారం తెలిపాయి. భారత్ దౌత్య నైపుణ్యంతో సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించినట్లు తెలుస్తోంది.

**ఏకపక్ష సుంకాలపై ఆందోళన**

ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా సుంకాలు విధించడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా చేపట్టే ఏకపక్ష నిర్బంధ చర్యలను ఖండించాయి.

అంతర్జాతీయ వివాదాలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి కట్టుబడి ఉన్నట్లు నేతలు స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాలు, సంఘర్షణల ముప్పును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

**శాంతి, స్థిరత్వానికి కట్టుబాటు**

అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారంలో పరస్పర సహకారం ప్రాముఖ్యతను బ్రిక్స్ దేశాలు పునరుద్ఘాటించాయి. అంతర్జాతీయ శాంతి, స్థిరత్వానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి. తీవ్రవాద కార్యకలాపాలను బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు తీవ్రంగా ఖండించింది. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిన అవసరం ఉందని నేతలు స్పష్టం చేశారు.

**పహల్గాం ఉగ్రదాడికి ఖండన**

గతేడాది జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాల నేతలు ఖండించారు. సీమాంతర ఉగ్రవాదం, తీవ్రవాద చర్యలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని స్పష్టం చేశారు.

**నేతలకు మోదీ ప్రత్యేక విందు**

బ్రిక్స్ సదస్సుకు హాజరైన దేశాల నేతలు అనంతరం 'భారత్ ఇన్నోవేట్స్' ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అక్కడ ఫొటోలు దిగడంతో పాటు మొక్కలు నాటారు. రాత్రి 7.30 గంటలకు సదస్సుకు హాజరైన నేతలందరికీ ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక విందు ఇవ్వనున్నారు.




# బీఎస్పీ వారసత్వంలో మాయావతి ఊహించని ట్విస్ట్..

**మొదటిపేజీ తరువాయి**

అప్పగించే సూచనలు ఇవ్వడం ద్వారా సరికొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేపారు.

**కొడుకులకు దక్కని పగ్గాలు..**
**తెరపైకి కుమారి దీపిక**

బీఎస్పీని కుటుంబ పాలన జాడ్యం నుంచి కాపాడటమే తన పరమ లక్ష్యమని మాయావతి స్పష్టం చేశారు. అవివాహితురాలినైన తనకు భద్రత అవసరాల రీత్యా తోడుగా ఉన్న సోదరుడు ఆనంద్ కుమార్ కుమారులెవరికీ.. బీఎస్పీలో చిన్న, పెద్ద ఎలాంటి పదవులూ ఇచ్చే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. అంతేకాదు, భవిష్యత్తులో వారి సంతానానికి కూడా పార్టీలో స్థానం ఉండదని కఠిన నిబంధన విధించారు. అయితే ఆనంద్ కుమార్‌కు సాయం చేసే నెపంతో ఆయన కుమార్తె దీపికా ఆనంద్ రాజకీయ అరంగేట్రానికి మాత్రం పరోక్షంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిజాయితీ, విధేయత, పనితీరు ఆధారంగా ఆమెకు బాధ్యతలు కట్టబెట్టవచ్చని, ఒకవేళ దీపిక అందుకు ముందుకు రాకపోతే బహుజన్ సమాజానికి చెందిన నిబద్ధత కలిగిన మిషనరీ కార్యకర్తకే ఆ అవకాశం దక్కుతుందని వెల్లడించారు.

**జెన్-జీ, జెన్-ఆల్ఫాపై దృష్టి..**
**50 శాతం యువతకే పెద్దపీట**

రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త తరం యువ నాయకత్వాన్ని తెరపైకి తీసుకురావడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నట్లు మాయావతి తెలిపారు. జెన్‌జీ, జెన్‌ఆల్ఫా ఆలోచనలకు అనుగుణంగా పార్టీలో 50 శాతం మేర సంస్థాగత బాధ్యతలను యువతకే కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. రాజ్యాంగ విలువలు, అంబేద్కర్‌వాద సిద్ధాంతాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే కొత్త తరాన్ని నిర్మించడమే తన సంకల్పమని పేర్కొన్నారు. నాలుగు సార్లు బీఎస్పీ సాగించిన సుపరిపాలనలో రోడ్లు, తాగునీరు, విద్య, ఉపాధి, రక్షణ రంగాల్లో మైలురాళ్ళు సాధించామని, పల్లెల నుంచి వలసలను అడ్డుకున్నామని మాయావతి గుర్తుచేశారు. 2012లో విపక్షాలు సాగించిన కులతత్వ రాజకీయాల కారణంగానే బీఎస్పీ ఓటమి చవిచూడాల్సి వచ్చిందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చట్టబద్ధ పాలన అటకెక్కిందని, బీఎస్పీ మళ్లీ అధికారంలోకి రాకుండా ఉండేందుకు ప్రత్యర్థులు 'సామ, దాన, భేద, దండోపాయాలు' ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు.

క్రమశిక్షణారాహిత్యం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా బయటకు పంపిన నేతలను తిరిగి పార్టీలోకి చేర్చుకుంటున్నారంటూ సాగుతున్న ప్రచారాన్ని ఆమె పూర్తిగా కొట్టిపారేశారు. అదంతా తప్పుడు ప్రచారమని, క్రమశిక్షణ ఉల్లంఘించిన ఏ ఒక్కరికీ బీఎస్పీ తలుపులు తిరిగి తెరుచుకోవని తేల్చిచెప్పారు. అంబేద్కర్‌వాద ఆశయ సాధనకు కార్యకర్తలు పూర్తి శక్తితో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయం వేగవంతం

**మొదటిపేజీ తరువాయి**

నిర్ణయించినట్లు చెప్పారు. జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్టుకు సంబంధించిన డీపీఆర్, మాస్టర్‌ప్లాన్ రూపకల్పనను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉత్తర తెలంగాణ కనెక్టివిటీ అవసరాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

**రక్షణ శాఖ సుముఖత**

ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు అవసరమైన సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయం కోసం ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు, వరుస సమావేశాలు, లేఖలు, నిరంతర సమన్వయం తుది దశకు చేరుకోవడం సంతోషంగా ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష సాకారమయ్యే దిశగా కీలక ముందడుగు పడిందని పేర్కొన్నారు.

**2.75 కిలోమీటర్ల రన్‌వే**

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి రక్షణ, పౌర విమానయాన శాఖల అధికారులు ఇప్పటికే పలుమార్లు సమావేశమైనట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. 2026 ఏప్రిల్ 17న అధికారులు విమానాశ్రయ స్థలాన్ని పరిశీలించారని, 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం అవసరమని నిర్ణయించారని చెప్పారు. ప్రస్తుతం ఐఏఎఫ్ వద్ద ఉన్న 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించిందన్నారు. ఈ భూమిలో ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, విజిటింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పార్కింగ్, వెదర్ షెల్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్లు, ఆపరేషనల్ కాంప్లెక్స్, శిక్షణ, నిర్వహణ సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

**సివిల్ టెర్మినల్, ఎంఆర్‌ఓ కేంద్రం**

పౌర విమాన సేవలకు అవసరమైన సివిల్ టెర్మినల్‌ను ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేయనుందని కిషన్‌రెడ్డి తెలిపారు. విమానాల నిర్వహణ, మరమ్మతుల కోసం ఎంఆర్‌ఓ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఎయిర్‌ఫోర్స్ సిబ్బందికి అవసరమైన నివాస, ఇతర మౌలిక సదుపాయాలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు.



# అధికారంలో ఉంటే సెక్రెటేరియట్‌కు రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు

**డీడీ9 వార్త**



అధికారంలో ఉంటే సెక్రెటేరియట్‌కు రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు

బీఆర్‌ఎస్ నాయకులు అధికారంలో ఉంటే సచివాలయానికి రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. అసెంబ్లీ లాబీలో శనివారం చిట్‌చాట్ సందర్భంగా సీతక్క బీఆర్‌ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఎర్రవల్లిలో ఎల్పీ మీటింగ్ నిర్వహించి, పార్టీ ఆఫీస్‌లో మాక్ అసెంబ్లీని ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ఫాంహౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపితే పసుపు నీళ్లతో శుద్ధి చేశారని, ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతో ఫాంహౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా? అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాని కేసీఆర్, మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమం పట్ల ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఫాంహౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్‌ఎస్ మినహా దేశంలో మరొకటి లేదని ఎద్దేవా చేశారు. ఫాంహౌస్‌లో ఎల్పీ మీటింగ్, పార్టీ ఆఫీస్‌లో అసెంబ్లీ మీటింగ్ అంటే ఉన్న దగ్గరకే అన్ని రావాలనుకోవడం దొరల అహంకారానికి నిదర్శనమన్నారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు.. అధికారం పోయినా అహంకారం ఇంకా పోలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తున్న బీఆర్‌ఎస్‌ను ప్రజలు శిక్షించడం ఖాయమని జోస్యం చెప్పారు.

# పినపాక నియోజకవర్గానికి రూ.186 కోట్ల హెచ్ఏఎం నిధులు.

- **బీటీ రహదారులు, వంతెనలు, బ్రిడ్జిల అభివృద్ధికి భారీగా నిధుల మంజూరు.**
- **దసరాలోపే పనులు ప్రారంభం – 15 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యత కూడా వారిదే..**

**మణుగూరు. సెప్టెంబర్ 12(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. నియోజకవర్గంలోని బీటీ రహదారులు, వంతెనలు, బ్రిడ్జిల నిర్మాణం మరియు అభివృద్ధి పనుల కోసం హెచ్ఏఎం నిధుల నుంచి సుమారు రూ.186 కోట్ల భారీ నిధులు మంజూరయ్యాయి.

ఈ విషయాన్ని పినపాక ఎమ్మెల్యే వెల్లడించారు. మంజూరైన నిధులతో నియోజకవర్గంలో అవసరమైన రహదారులు, వంతెనల అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల అనుసంధానం మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు.

ముఖ్యంగా దసరా పండుగలోపే పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అంతేకాకుండా, చేపట్టబోయే పనులకు సుమారు 15 సంవత్సరాల పాటు నిర్వహణ బాధ్యత కూడా సంబంధిత సంస్థలదే ఉండే విధంగా హెచ్ఏఎం విధానంలో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

పినపాక నియోజకవర్గ ప్రజల చిరకాల సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఇంత భారీ మొత్తంలో నిధులు మంజూరు కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని,

ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపినందుకు మంత్రి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

పినపాక నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తూ, రహదారులు, వంతెనల నిర్మాణానికి ఇంత భారీ స్థాయిలో నిధులు సమకూర్చిన రాష్ట్ర ప్రభుత్వం, ఆర్అండ్‌బీ శాఖ అధికారులు మరియు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. "ఈ నిధులతో నియోజకవర్గ రూపురేఖలు మారనున్నాయి. రహదారులు, వంతెనల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా పనులను వేగంగా ప్రారంభిస్తాం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# ముగిసిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల కాలపరిమితి..

- **సింగరేణిలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలి -- లేదా అన్ని సంఘాలకు సమాన హోదా కల్పించాలి.**
- **ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ కు వినతిపత్రం అందజేసిన..**
- **ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**

**మణుగూరు. సెప్టెంబర్12(డి డి 9వార్త)**

మణుగూరు సింగరేణి కాలరీస్ కంపెనీలో గుర్తింపు , ప్రాతినిధ్య కార్మిక సంఘాల కాలపరిమితి 2026 సెప్టెంబర్ 8వ తేదీతో ముగిసిన నేపథ్యంలో, వెంటనే కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని మణుగూరు ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

టిబిజికెయస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ దిశానిర్దేశం, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌ను, ఏరియా ఏ జి యం రమేష్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో కొత్తగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి, ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాలని వారు కోరారు.

ఈ సందర్భంగా నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణలో కార్మిక సంఘాల పాత్ర కీలకమని అన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా ఎన్నికల నిర్వహణలో జాప్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కార్మికుల ఓట్ల ద్వారా తమ ప్రతినిధి సంఘాన్ని ఎన్నుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు.

కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణకు సంబంధించి టిబిజికెయస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఇప్పటికే సింగరేణి ఉన్నతాధికారులను, కేంద్ర కార్మిక శాఖ పరిధిలోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (కేంద్ర) అధికారులను కలిసి ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలని వినతిపత్రాల ద్వారా కోరినట్లు నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎన్నికలు జరిగే వరకు సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా, సమాన అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏ ఒక్క కార్మిక సంఘానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వకుండా, అన్ని సంఘాలను సమానంగా పరిగణించి కార్మికుల సమస్యలపై చర్చలు, సమావేశాలకు అవకాశం కల్పించాలని కోరారు.

కొత్తగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి, నిర్ణీత కాలంలో ఎన్నికలు నిర్వహించి, కార్మికుల విశ్వాసాన్ని ఓట్ల ద్వారా పొందిన సంఘానికే గుర్తింపు కల్పించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా ఉంటుందని ఆయన అన్నారు.

"సింగరేణి కార్మికుల ఓటే అంతిమ తీర్పు. ఎన్నికలు నిర్వహించి కార్మికులు తమ ప్రతినిధి సంఘాన్ని స్వేచ్ఛగా ఎన్నుకునే అవకాశం కల్పించాలి. ఎన్నికలు జరిగే వరకు అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలి" అని నాగెల్లి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిబిజికెయస్ నాయకులు బంగారి పవన్ కుమార్, జంగం రాజ్ కుమార్, బొద్దుల ప్రవీణ్ కుమార్, కమటం పరమేష్, మస్తాన్, పి కె నాగరాజు, పద్దం శ్రీనివాస్, రమేష్‌బాబు,అజ్మీరా అశోక్, కళ్యాణ్ కుమార్, సర్వే నరేష్, కటారి ప్రసాద్, జగదీష్‌శ్రావణ్, బక్క సుధాకర్,ప్రవీణ్ సూరి, తన్నీరు లింగయ్య, లక్కీవుద్దీన్, రాజేందర్, తిరుపతి, సాయి అరుణ్, నాగుల రఘు, కార్తీక్,విజయ్, తదితరులు పాల్గొన్నారు



# పేద గర్భిణీలు, బాలింతలకు రోటరీ అండా

- **రూ.35 వేల విలువైన 70 తల్లీ–పిల్లల సంరక్షణ కిట్ల పంపిణీ**
- **సర్పంచ్ పూనెం కృష్ణ, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా కిట్ల పంపిణీ**

**భద్రాచలం, (డిడి9 వార్త)**

భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలు, బాలింతలకు రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో తల్లీ-పిల్లల సంరక్షణ కిట్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు షేక్ అజీమ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ ముఖ్య అతిథిగా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలోని లబ్ధిదారులకు మొత్తం రూ.35 వేల విలువైన 70 సంరక్షణ కిట్లను అందజేశారు. ప్రతి కిట్‌లో గర్భిణీలు, బాలింతలకు అవసరమైన మల్టీవిటమిన్ టానిక్, ప్రోటీన్ పౌడర్, బ్రెడ్, రెండు రకాల పండ్లను అందించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో తల్లీ, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదలకు రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

పేద ప్రజలకు తమ సంస్థ తరఫున సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ పాపినేని రాజేష్, ట్రెజరర్ కె. రామకృష్ణ, సలహాదారులు యశోద రాంబాబు, వీరయ్య, ప్రభాకర్ గుప్తా, రోటేరియన్లు డాక్టర్ వి. సంతోష్, విద్యాసాగర్, ఎం.డి. రఫీ, జకరయ్య, వి. రాజశేఖర్, పి. మోహన్‌కృష్ణ, వి.







# అశ్వరావుపేట అమ్మ సేవాసదన్ లో వృద్ధురాలు మృతి...

- **కడసారి చూపు కూడా నోచుకోని ప్రబుద్ధులు..**
- **మానవత్వం చాటుకున్న పవన్ కళ్యాణ్ సేవా సమితి, మరియు ప్రెస్ క్లబ్...**

**అశ్వరావుపేట:సెప్టెంబర్12 (డిడి 9 వార్త)**

అశ్వరావుపేట పట్టణంలో అమ్మ సేవాసదన్ నిర్వాహకులు ఎందరో వృద్ధులు ఆశ్రయము కల్పించి వారి ఆలనా పాలన చూస్తూ నా యాజమాన్యానికి చేదు అనుభవం ఎదురైన తీరు అందరికీ కంటినీరు తెప్పిస్తుంది.

ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చూసేవారు లేక ఆశ్రమంలో చేరిన వృద్ధులకు వారు చనిపోయిన తర్వాత పిల్లలు చూడటానికి కూడా రాలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నవ మాసాలు మోసిన తల్లిదండ్రులను అనాధ ఆశ్రమాలలో, వృద్ధాశ్రమాలలో వదిలి వెళ్ళిపోతున్నారు. కనీసం కడసారి చూపైనా చూడకపోతే వారి ఆత్మ ఘోషిస్తుందన్న విషయం అర్థమవుతుందా? అశ్వారావుపేట అమ్మ సేవా సదన్ వృద్ధాశ్రమంలో శుక్రవారం రాత్రి ఓ వృద్ధురాలు మృతి చెందింది. వృద్ధురాలి పిల్లలకు ఫోన్ ద్వారా ఆశ్రమ నిర్వాహకులు తెలియపరిస్తే మేము రాలేని పరిస్థితిలో ఉన్నాము అంత్యక్రియలు మీరే చేసేయండి అంటూ తెలియజేయడంతో ఆశ్రమ నిర్వాహకులుఅశ్వారావుపేట ప్రెస్ క్లబ్ అసోసియేషన్, పవన్ కళ్యాణ్ సేవా సమితి బాధ్యులకు తెలియజేయడంతో దాన సంస్కారాలను పూర్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుమల శెట్టి అప్పారావు, పవన్ కళ్యాణ్ సేవా సమితి అధ్యక్షులు దేగల రామచంద్రరావు, కురిశెట్టి నాగబాబు నాయుడు(V6 వెలుగు), ఎస్ కే వలీ పాషా(I న్యూస్), ఎండి ముజాఫర్ ఖాన్ (సాక్షి రూరల్), మాసాబత్తుల శ్రీను (స్వతంత్రా ఛానల్), మునీర్ పాషా సూర్య,) నక్క సత్యనారాయణ(నిఘ పత్రిక), కొట్టే శ్రీనివాసరావు (మీసాల శ్రీను) మంగ దొడ్డి సాయి స్మశాన వాటికలో పమిడి లక్ష్మణరావు, మానేపల్లి ఏసు సహకరించి ఆ వృద్ధురాలు అంత్యక్రియలకు పాల్గొని అందరి మన్ననలు పొందుతున్నారు.



# 146వ సర్వేనెంబర్ కు సంబంధించిన భూభాగం పై ఆధారాలతో మీడియా ముందుకు వచ్చిన కామారం గ్రామ సర్పంచ్ కొర్నిబెల్లీ సావిత్రి గ్రామపంచాయతీ ప్రజలు

- **మీ భూభాగం మీకే మా భూభాగం జోలికి రావద్దు**

**తాడ్వాయి డిడి9 వార్త**

తాడ్వాయి మండలంl కామారం146వ సర్వే నంబర్‌కు సంబంధించిన భూభాగంపై ఆధారాలతో మీడియా ముందుకు వచ్చిన కామారం గ్రామ సర్పంచ్ కొర్నిబెల్లి సావిత్రి గ్రామ పంచాయతీ ప్రజలు146వ సర్వే ప్రకారం తమ భూభాగానికి సంబంధించిన పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాటితోనే మీడియా ముందు వాస్తవాలను వివరించినట్లు కామారం గ్రామ సర్పంచ్ కోర్నబెల్లి సావిత్రి తెలిపారు 2020నాటి నుంచి ఈ భూభాగం కోసం తమ పోరాటం కొనసాగుతోందని, సమస్య పరిష్కారం కోసం ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామ ప్రజలు తెలిపారు అలాగే బీఆర్ఎస్ పార్టీ తాడ్వాయిసర్పంచ్ వాస్తవాలనుపూర్తిగా తెలుసుకొని మాట్లాడాలని,పూర్తిసమాచారం లేకుండా కామారం గ్రామ భూభాగంపై వ్యాఖ్యలు చేయడం సరికాదని కామారం గ్రామ సర్పంచ్ కోర్నబెల్లి సావిత్రి గ్రామ ప్రజలు అన్నారు మా భూభాగం జోలికి రావద్దు ఆధారాలు మా వద్ద ఉన్నాయి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి అని వారు స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో కామారం గ్రామ పంచాయతీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# 70వ ఎస్ జీ ఆఫ్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం చేసిన ములుగు జిల్లా మార్కెట్ కమిటీ చైర్మెన్ రేగ కళ్యాణి

- **స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి మండల స్థాయి క్రీడలు సమ్మక్క సారలమ్మ**
- **తాడ్వాయి మండలం కేంద్రం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పి యం శ్రీ పాఠశాల ఇంగ్లీషు మీడియం గ్రౌండ్స్ లో ఏర్పాటు చేయడం జరిగింది**

**తాడ్వాయి డిడి9 వార్త**

ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలంలో 8 వివిధ పాఠశాలలు జేడీపీ, కే జీ బి వి, ఆశ్రమ పాఠశాల క్రీడాకారులు అండర్ 14 మరియు 16 వయస్సు వారికీ, కోకో, కబడ్డీ, వాలీబాల్ మరియు అథెలిటిక్స్ ముఖ్య అతిథి రేగ కళ్యాణి, ములుగు జిల్లా మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రారంభం చేశారు, క్రీడాకారులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ క్రీడాకారులు చదువు నీ నిర్లక్ష్యం చేయకూడదు, విద్యార్థులు మొబైల్ కి దూరంగా ఉండాలి అన్నారు క్రీడలు మరియు చదువు రెండు విద్యార్థుల భవిష్యత్తుకీ కీలకం అన్నారు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి లో రాణించలి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి అన్నారు

ఈకార్యక్రమంలో అధ్యక్షత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రేవతి , మండల క్రీడా కన్వీనర్ యం ఈ ఓ గడ్డి శ్రీనివాస్ స్పోర్ట్స్ ఆఫీసర్ యలం ఆదినారాయణ క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ వంక రాంచందర్ ఫిజికల్ డైరెక్టర్ గడ్డం లక్ష్మీనారాయణ , విజయ పి ఈ టీ లు, సతీష్ , కృష్ణ, ఉపాధ్యాయులు మరియు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు



# అయ్యప్ప ధర్మ ప్రచారానికి శ్రీకారం!

- **సూర్యాపేటలో ఏబీఏపీ రాష్ట్ర సమావేశం.. పెద్దపల్లి జిల్లా సేవకుల సమరభేరి**

**పెద్దపల్లి బ్యూరో, (డీడీ9 వార్త):**

అయ్యప్ప ధర్మ ప్రచారాన్ని మరింత విస్తృతం చేసి ప్రతి గ్రామానికి, ప్రతి పట్టణానికి, ప్రతి భక్తుడికి అయ్యప్ప స్వామి ఆధ్యాత్మిక సందేశాన్ని చేరవేయాలని అఖిలభారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర సమావేశం పిలుపునిచ్చింది. సూర్యాపేట జిల్లా ఏబీఏపీ శాఖ ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేటలోని అయ్యప్ప దేవాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పుల్లం రాజు అధ్యక్షతన రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పెద్దపల్లి జిల్లా నుంచి ఏబీఏపీ తెలంగాణ రాష్ట్ర వాలంటీర్ కమాండెంట్ జనగామ తిరుపతి, పెద్దపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు బ్రహ్మశ్రీ రాంపల్లి వామన శర్మ, ఉపాధ్యక్షులు అమ్మరాజు గురుస్వామి, ముత్యాల సతీష్, కార్యదర్శి వేదాంతం శేషకుమార్ గురుస్వామి, కోశాధికారి పల్లెర్ల జగన్ స్వామి హాజరయ్యారు. సమావేశంలో భవిష్యత్తులో చేపట్టాల్సిన అయ్యప్ప ధర్మ ప్రచార కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా అయ్యప్ప స్వామి దీక్ష యొక్క విశిష్టత, దీక్షా నియమాలు, ఆచరించాల్సిన ధర్మాలు, భక్తులు పాటించాల్సిన నియమనిష్ఠలు తదితర అంశాలపై నాయకులు చర్చించారు.అయ్యప్ప ధర్మం, దీక్షా నియమాలు, స్వామివారి ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ధర్మ ప్రచార కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని నిర్ణయించారు.

సమావేశానికి హాజరైన పెద్దపల్లి జిల్లా అయ్యప్ప సేవకులను సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులతో పాటు వివిధ జిల్లాల నుంచి పలువురు అయ్యప్ప స్వాములు, సేవకులు పాల్గొన్నారు.





# టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణకు మాతృవియోగం...

**బోనకల్,సెప్టెంబర్ 12, (డీడీ9 వార్త):**



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు,బోనకల్లు మండల టీడీపీ అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ తల్లి సీతమ్మ (90) వయోభార సమస్యలతో బ్రాహ్మణపల్లిలోని స్వగృహంలో శనివారం ఉదయం మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఖమ్మం పార్లమెంటరీ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం సీతమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తండ్రి మృతి చెందిన రెండు వారాలకే తల్లిని కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొంటూ సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అనంతరం పాలేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్,మధిర పట్టణ టీడీపీ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు,జిల్లా తెలుగురైతు మాజీ అధ్యక్షుడు నందమూరి సత్యనారాయణ, ఐటీడీపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వేమూరి సునీల్,జిల్లా తెలుగుయువత బాధ్యులు మైనేని రవి, బ్రాహ్మణపల్లి టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పాటిబండ్ల సుబ్బారావు, ఐటీడీపీ జిల్లా బాధ్యులు షరీఫ్, టీడీపీ నాయకులు కర్నాటి అశ్వనీ కుమార్, నాగార్జున శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాస్,మరీదు బరకయ్య,తాత సుధాకర్ కాంగ్రెస్ నాయకులు కందుల పాపారావు,తదితరులు సీతమ్మ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు.

# నాయీబ్రాహ్మణులు ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధం కావాలి..

- **క్షౌరవృత్తిలోకి కార్పొరేట్ ప్రవేశాన్ని అడ్డుకోవాలి..**
- **ఆలయాలు, జాతరల్లో ఉద్యోగాలు.. తలనీలాల ఆదాయంలో వాటా సాధించాలి..**

**సెప్టెంబర్ 12. డిడి 9 వార్త వెంకటాపురం.**

నాయీబ్రాహ్మణుల హక్కులు, ఆత్మగౌరవం, జీవనోపాధి పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జంపాల రవీందర్ పిలుపునిచ్చారు.
వెంకటాపురం మండల నాయీబ్రాహ్మణ సంఘం మహాసభను శనివారం కొయ్యల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు గౌరవ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జంపాల రవీందర్ మాట్లాడుతూ.. క్షౌరవృత్తిలోకి కార్పొరేట్ సంస్థల ప్రవేశాన్ని అడ్డుకోవాలని, తరతరాలుగా వృత్తినే జీవనాధారంగా చేసుకున్న నాయీబ్రాహ్మణుల ఉపాధిని కాపాడేందుకు సంఘటిత పోరాటాలు నిర్వహించాలని అన్నారు.
ఆలయాలు, జాతరల్లో నాయీబ్రాహ్మణులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, తలనీలాల ద్వారా వచ్చే ఆదాయంలో న్యాయమైన వాటా సాధించాలని డిమాండ్ చేశారు. సకల సామాజిక రంగాల్లో "మేమెంతో.. మాకంత వాటా" అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
రాష్ట్రవ్యాప్తంగా నాయీబ్రాహ్మణ సంఘాలన్నీ ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆధిపత్యాల కోసం సంఘాలను విభజించుకోవడం వల్ల సమాజానికి నష్టం జరుగుతుందని, "ఇది రాజకీయ పార్టీ కాదు.. ఆధిపత్యాల కోసం సంఘాలను విడదీయడం మానుకోవాలి" అని సూచించారు.
సంఘాలు అనేక ముక్కలుగా ఉండటం వల్లే హక్కులు, ఆత్మగౌరవ భవనాలు, ఇతర సంక్షేమ డిమాండ్ల సాధనలో వెనుకబడుతున్నామని పేర్కొన్నారు. ఇకనైనా విభేదాలను పక్కనపెట్టి నాయీబ్రాహ్మణులందరూ ఐక్యంగా కదలాలని కోరారు.ఈ నెల 15న ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా మహాసభ



నాయీబ్రాహ్మణ సంఘాల ఐక్యతకు వేదిక కావాలని ఆకాంక్షించారు. అన్ని సంఘాల రాష్ట్ర నాయకులు, ప్రతినిధులు మహాసభకు హాజరై ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.
హక్కుల సాధన కోసం భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించేందుకు నాయీబ్రాహ్మణులు సిద్ధం కావాలని రవీందర్ స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో ములుగు ఆహ్వాన కమిటీ అధ్యక్షులు జంపాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చెన్న కుమార్, యువజన నాయకులు చిక్కల వెంకటేష్, వాజేడు మండల అధ్యక్షులు సిరిమర్తి మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజశేఖర్, ఉపాధ్యక్షుడు బద్దెల సత్యనారాయణ, కొయ్యల శివ, కొయ్యల ప్రశాంత్, కొయ్యల శ్రీకాంత్, కొయ్యల పవన్, రావులపాటి రాజు, కొట్నాల రమేష్, కొట్నాల సాయి, రావులపాటి నరసింహారావు, పాలడుగు ప్రసాద్, అందుర్తి రవితేజ, ములుకుట్ల వివేక్, రావులపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు

# గుర్తుతెలియని వ్యక్తి ఆసుపత్రిలో మృతి

**బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**

బోధన్ పట్టణంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలైన ఒక అజ్ఞాత వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బోధన్ ఎస్.హెచ్.ఓ.వెంకట నారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 10న బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో రోడ్డుపై యాచించుకునే ఓ వ్యక్తిని టీఎస్16ఈ9102 నంబరు గల గ్లామర్ బైక్ ఢీకొట్టింది. ఆ సమయంలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది వెంటనే స్పందించి తీవ్రంగా గాయపడిన అతడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సదరు వ్యక్తి పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల ప్రాంతంలో మృతి చెందారని పోలీసులు వెల్లడించారు. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉంటుందని, అతడి కుడి చేతిపై శివుని పచ్చబొట్టుతో పాటు చేతికి కడియం ఉందని తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు గానీ, అతడి బంధువుల సమాచారం గానీ తెలిసిన వారు వెంటనే బోధన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్లు 8712659778, 8712659870 లలో సంప్రదించాలని ఎస్.హెచ్.ఓ. విజ్ఞప్తి చేశారు.






# నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన మండల కమిటీ ఏర్పాటు..

- **అధ్యక్షుడిగా కొయ్యల రమణయ్య.. ప్రధాన కార్యదర్శిగా కొట్నాల సాయి ముఖేష్ ఏకగ్రీవ ఎన్నిక..**

**సెప్టెంబర్ 12: డిడి9 వార్త వెంకటాపురం.**

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం వెంకటాపురం మండల నూతన కార్యవర్గాన్ని శనివారం మండల కేంద్రంలోని వేపచెట్టు సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ములుగు జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు జంపాల రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై, తన అధ్యక్షతన నూతన కార్యవర్గం ఎన్నికను నిర్వహించారు.
మండల అధ్యక్షుడిగా కొయ్యల రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా కొట్నాల సాయి ముఖేష్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా కొయ్యల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కొయ్యల శ్రీకాంత్, కోశాధికారిగా రావులపాటి నరసింహారావు, సహాయ కార్యదర్శిగా పాలడుగుల ప్రసాద్, ప్రచార కార్యదర్శిగా కొయ్యల పవన్ కుమార్లను ఎన్నుకున్నారు.
ఈ సందర్భంగా సంఘ భవిష్యత్ కార్యక్రమాలు, సమాజ సేవా కార్యక్రమాల విస్తరణ, సభ్యుల ఐక్యతను మరింత బలోపేతం చేయడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.నూతన అధ్యక్షుడు కొయ్యల రమణయ్య మాట్లాడుతూ.. సంఘ లక్ష్యాల సాధనకు ప్రతి సభ్యుడు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయీ బ్రాహ్మణ సమాజ అభ్యున్నతితో పాటు ప్రజాసేవలో ముందుండి, సమాజంలో సంఘ సేవలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా పనిచేస్తామని తెలిపారు.నూతన కార్యవర్గానికి సభ్యులు, నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల హక్కుల కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

- **తపస్ రాష్ట్ర అధ్యక్షుడు వోడ్నాల రాజశేఖర్**

**భద్రాచలం టౌన్ , సెప్టెంబరు 12 ( డీ డీ 9 వార్త)**

ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీతో పాటు పెండింగ్ లో ఉన్న ఆరు డీఏలను సెప్టెంబర్ 18వ తేదీలోగా ప్రకటించి అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్ ) రాష్ట్ర అధ్యక్షుడు వోడ్నాల రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోతే వారి హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
భద్రాచలంలో శనివారం నిర్వహించిన తపస్ రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా విద్యారంగంలో నెలకొన్న సవాళ్లు, ఉపాధ్యాయుల సమస్యలు, ప్రభుత్వ విధానాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలని, 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు 190 జీవోను వెంటనే అమలు చేయాలని రాజశేఖర్ డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల సమస్యల పరిష్కారానికి జీవో 25ను సవరించాలని, ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూల్ , గిరిజన, ఆశ్రమ, ఆర్ట్స్ రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తపస్ డిమాండ్ చేసింది. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, గురుకుల ఉపాధ్యాయుల అధిక వర్ క్లోడ్ ను తగ్గించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 హెడ్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరింది. సమావేశానికి అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ సంఘటన మంత్రి మహేంద్ర కపూర్ , ఆర్ ఎస్ ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై ఉపాధ్యాయులకు మార్గదర్శనం చేశారు. విద్యారంగ పరిస్థితులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సమాజ నిర్మాణంలో ఉంది.




# సీతారాముల దర్శించుకున్న అరకు ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

- **స్వామివారికి నేత్రపర్వంగా నిత్యకల్యాణం**

**భద్రాచలం టౌన్ , సెప్టెంబరు 12 ( డీడీ 9 వార్త )**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని ఆంధ్రప్రదేశ్‌లోని అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న వారికి దేవస్థానం అధికారులు, అర్చకులు, వేద పండితులు ఆలయ సంప్రదాయాల ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ వేద పండితులు అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం పలికారు. దేవస్థానం అధికారులు ఆలయ విశిష్టత, స్వామివారి సేవలను వారికి వివరించారు. అలాగే స్వామి వారికి శనివారం అర్చకులు శాస్త్రోక్తంగా నిత్య కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తిశ్రద్ధలతో కల్యాణ ఘట్టాన్ని వీక్షించారు.




# వర్షం పడితే.. రాజీవ్‌నగర్‌లో నరకమే

- **రూపా స్కూల్ వెనుక ఓవర్‌ఫ్లో అవుతున్న డ్రైనేజీ**
- **రోడ్డుపైకి మురుగునీరు.. చిన్నారులు, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు**

**భద్రాచలం, సెప్టెంబరు 12 (డిడి9 వార్త)**

భద్రాచలం ఐటీడీఏ రోడ్డులోని రాజీవ్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూపా స్కూల్ వెనుక ఉన్న సందులోని డ్రైనేజీకి పలు ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటితో పాటు వర్షపు నీరు చేరుతుండటంతో కొద్దిసేపు వర్షం కురిసినా కాలువ ఓవర్‌ఫ్లో అవుతోంది. దీంతో మురుగునీరు రోడ్డుపైకి ప్రవహించి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
రూపా స్కూల్ వెనుక ఉన్న డ్రైనేజీ సుమారు ఐదు అడుగుల లోతు, రెండు అడుగుల వెడల్పుతో ఉంది. కాలేజీ గ్రౌండ్ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీటితో పాటు ఇతర డ్రైనేజీల నీరు కూడా ఇదే కాలువలోకి చేరుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఒక్కసారిగా అధిక మొత్తంలో నీరు చేరడంతో డ్రైనేజీ సామర్థ్యం సరిపోక ఓవర్‌ఫ్లో అవుతున్నట్లు పేర్కొంటున్నారు.
వర్షం తగ్గిన తర్వాత కూడా రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రూపా స్కూల్‌కు వెళ్లే చిన్నారులు మురుగునీటి మధ్య నుంచి వెళ్లాల్సి వస్తుండటంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
కాలేజీ గ్రౌండ్ వైపు నుంచి వచ్చే అదనపు వర్షపు నీటిని నియంత్రించడంతో పాటు, పలు డ్రైనేజీల నీరు ఒకే కాలువలోకి చేరకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచి, వర్షపు నీరు-మురుగునీరు రోడ్డుపైకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని రాజీవ్‌నగర్ కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.





# చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం ఆధ్వర్యంలో..

- **ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం.**
- **ఇప్పటికే 950 మందికి పైగా ఉచిత కంటి శస్త్రచికిత్సలు..**

**మణుగూరు. సెప్టెంబర్ 12(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు.
చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం మరియు హైదరాబాద్‌లోని శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మణుగూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.ఈ శిబిరంలో మొత్తం 150 మంది రోగులకు (OP) కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 40 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శస్త్రచికిత్సలకు ఎంపికైన వారికి హైదరాబాద్‌లోని శంకర్ కంటి ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్స, లెన్స్ అమరిక, మందులు, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలను కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన కంటి వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం నిరంతరం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటివరకు 950 మందికి పైగా నిరుపేదలకు ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించి, వారి జీవితాల్లో వెలుగులు నింపింది. సమాజ సేవే లక్ష్యంగా సంఘం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్కేటీ గ్రూప్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు, మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రకాని గురుకృష్ణ, ప్రధాన కార్యదర్శి వీర మధుసూదన్, న్యాయవాదులు సరస్వతి, వాసవి, అశ్వాపురం స్వరాజారావు, హెవీ వాటర్ ప్లాంట్ మాజీ ఉద్యోగి ఎం. వెంకటేశ్వర్లుహాజరయ్యారు.
శిబిరాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన హైదరాబాద్ శంకర్ కంటి ఆసుపత్రి వైద్య బృందానికి, దాతలకు, స్వచ్ఛంద సేవకులకు, సహకరించిన ప్రజలకు చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ మహారాజ్ సేవా సంఘం కమిటీ సభ్యులు రేఖ రాజశేఖర్, పెద్దిరెడ్డి గోపిరెడ్డి, సుంకు కనకరాజు, గునిగంటి చందర్, నమ్మి జగదీష్, తెలంగాణ సురేష్, కాసర్ల అనిల్, అడ్వకేట్స్ కె. శ్రీహరి, కపిల్ రాజు, అత్తులూరి అరుణ్ తదితరులు పాల్గొని శిబిరం విజయవంతం కావడానికి విశేష కృషి చేశారు.




# పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 70 (3) సవరణ పట్ల హర్షం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు

**మణుగూరు. సెప్టెంబర్ 12(డి డి 9వార్త)**

గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకి జమ చేయకుండా గ్రామపంచాయతీ ఖాతాల్లో జమ చేసుకొని గ్రామపంచాయతీ అవసరాలకు తీర్మానం చేసుకొని ఖర్చు చేసుకునే విధంగా పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 70 (3) సవరణ చేసి అసెంబ్లీలో ఆమోదం తెలిపి చట్ట సవరణ చేయడం పట్ల సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ లు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గ్రామపంచాయతీ అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను సత్వరం పరిష్కారం చేసుకోవడానికి పంచాయతీలకు గొప్ప అవకాశాన్ని కల్పించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారికి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కు, అలాగే పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు.



# వినాయక చవితి సందర్భంగా ప్రతి గణేశ్ మండపం వద్ద తప్పక పాటించాల్సిన భద్రతా జాగ్రత్తలు.

- **భక్తి ఉత్సాహంలో భద్రతను మర్చిపోవద్దు...**
- **ఒక్క చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి కారణం కావచ్చు!**

**మణుగూరు. సెప్టెంబర్ 12 (డి డి 9వార్త)**

విద్యుత్ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి మండపంలో లైటింగ్, సీరియల్ బల్బులు, సౌండ్ సిస్టమ్ కోసం నాణ్యమైన వైరింగ్ మాత్రమే ఉపయోగించాలి. వైర్లు బయటకు వేలాడకుండా, నీరు తగలకుండా చూడాలి. ఓవర్‌లోడ్ కనెక్షన్లు పెట్టకూడదు.

**అగ్ని ప్రమాదాలపై ప్రత్యేక జాగ్రత్త.**

కర్పూరం, దీపాలు, అగరబత్తులు వెలిగించే ప్రదేశంలో మండే వస్తువులు ఉండకూడదు. మండపం వద్ద తప్పనిసరిగా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ అందుబాటులో ఉంచడం మంచిది.

**రద్దీ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు**

పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చినప్పుడు క్యూలు క్రమబద్ధంగా ఉండేలా వాలంటీర్లను ఏర్పాటు చేయాలి. తోపులాట జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలి.



**సౌండ్ సిస్టమ్ బాధ్యతగా ఉపయోగించాలి.**

ప్రజలకు ఇబ్బంది కలగకుండా, నిబంధనలు మరియు నిర్ణీత సమయాలను పాటిస్తూ స్పీకర్లను ఉపయోగించాలి.
వర్షం విషయంలో ముందస్తు జాగ్రత్త మండపం పైకప్పు, విద్యుత్ కనెక్షన్లు, జనరేటర్ విషయంలోచర్యలు తీసుకోవాలి.
పైన తెలిపిన జాగ్రత్తలు పాటిస్తూ,ప్రజలందరూ సంతోషంగా గణనాథుని పూజించి ఆనందంగా పండుగ వాతావరణాన్ని ఆస్వాదించాలని విజ్ఞప్తి.

## లోక్ అదాలత్ కక్షిదారులకు రోటరీ క్లబ్ అల్పాహార వితరణ

- **రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం -మెజిస్ట్రేట్ శివ నాయక్**

**భద్రాచలం , సెప్టెంబరు 12 ( డిడి9 వార్త )**

జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా భద్రాచలం కోర్టు ఆవరణలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కక్షిదారుల కోసం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. లోక్ అదాలత్ నిమిత్తం ఉదయాన్నే కోర్టుకు చేరుకుని ఇబ్బందులు పడుతున్న సుమారు 200 మందికి వేడివేడి వెజ్ పలావ్ ప్యాకెట్లను అందజేశారు. ఈ మానవతా కార్యక్రదంలో స్థానిక న్యాయమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాస్, రోటరీ క్లబ్ అధ్యక్షులు షేక్ అజీమ్, కార్యదర్శి రాజేష్, కోశాధికారి కొత్త రామకృష్ణ, కోర్టు సిబ్బంది మరియు న్యాయవాదులు స్వయంగా పాల్గొని కక్షిదారులకు అల్పాహారం వడ్డించారు. సుదూర గ్రామాల నుంచి వచ్చే సామాన్యులకు భోజన వసతి కల్పించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.





## భజన కార్యక్రమం ముగింపు

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ( డి డి 9 వార్త ) సెప్టెంబర్ 12**

తలమడుగు మండలం జరీ గ్రామంలో శ్రావణమాసం సందర్భంగా. నెలరోజుల పాటు గ్రామంలో గల రాజరాజేశ్వర ఆలయంలో. గ్రామస్తులంతా ఐక్యతతో. మత్తు పానీయాలకు దూరంగా ఉంటూ. ఉపవాస దీక్షలతో 30 రోజులపాటు. శివ నామస్మరణతో భజన కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు అనగా శనివారం. ఉదయం భజన బృందంతో. గ్రామస్తులంతా కలిసి గ్రామంలో గల ఆలయాల చుట్టూ భజన సంకీర్తనలతో ప్రదక్షిణలు చేసి.. భజన కార్యక్రమం ముగించారు. అనంతరం గ్రామంలో గల భజన కళాకారులను సన్మానించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భజన కళాకారులు హన్మండ్లు. కో రెడ్డి స్వామి. ఆడేల్లు. గంగన్న. బూరుగు స్వామి. నారాయణ. భగవాన్లు. రామ్ చందర్. శ్రీనివాస్. పోచ్చన్న. గ్రామస్తులు. భూమా రెడ్డి. కాశీరాం మాధవ్. వెంకట్ రెడ్డి. రుక్మారెడ్డి మరియు మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు



## లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**

తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, సీఎంఆర్ఎఫ్ నిధులు పేదలకు ఎంతో ఊరట కలిగిస్తున్నాయని బోధన్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్ పేర్కొన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని పాన్‌గల్లీ 15వ వార్డు కౌన్సిలర్ గుమ్మల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారుడు పోచమ్మల సాయికుమార్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును పాషా మొయినొద్దీన్ అందజేశారు. కష్టకాలంలో ప్రభుత్వం అందించిన సాయం పట్ల సాయికుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు మేరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం

- **ఆరు వారాల్లో 1,784 కేసులు నమోదు**
- **రూ. కోటి 45 లక్షల20 వేల జరిమానా.. 124 మందికి జైలు శిక్ష**



**నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఆగస్టు 2 నుండి సెప్టెంబర్ 12 వరకు నిర్వహించిన వాహన తనిఖీల్లో 1,784 కేసులు నమోదైనట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. పట్టుబడిన వాహనదారులను కోర్టుల్లో హాజరుపరచగా 124 మందికి వారం రోజుల జైలు శిక్ష విధించారని, మిగతా వారికి రూ. కోటి 45 లక్షల20 వేల జరిమానా విధించినట్లు వెల్లడించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సీపీ హితవు పలికారు. సవరించిన మోటార్ వాహనాల చట్టం2019 ప్రకారం మొదటిసారి పట్టుబడితే రూ.10 వేలు, రెండోసారి దొరికితే రూ.15 వేల జరిమానాతో పాటు జైలు శిక్షలు ఉంటాయని వివరించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు లేదా వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

# ప్రీ ప్రైమరీ అంతా గోల్ మాల్.....

- **ప్రీ ప్రైమరీ బోధకుల నియామకాలు నిబంధనల ప్రకారమే జరిగాయా?**
- **లేక అధికారుల నిర్ణయాల్లో లోపాలున్నాయా?**
- **త్రిసభ్య కమిటీలో ముగ్గురు ముఖ్య మండలస్థాయి శాఖల అధికారులు**
- **మొదటి వ్యక్తి అర్హతలో లోపం ఉంటే నియామకానికి ముందే ఎందుకు గుర్తించలేకపోయారు?**
- **అసలు మొదటిసారి ధ్రువ పత్రాలు పరిశీలన సరిగా జరిగిందా?**
- **అదే జరిగితే 40 రోజుల తర్వాత మరొకరికి అవకాశం ఎలా?**
- **నియామకాలు పారదర్శకంగా జరిగయా? ఏదైనా మతలబు జరిగి ఉంటుందా?**
- **ఒకే పోస్టుకు రెండు నిర్ణయాలా? త్రి సభ్య కమిటీ సభ్యుల తీరుపై తీవ్ర అభ్యంతరం**
- **ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వ్యవహారం...సమగ్ర విచారణకు డిమాండ్**







**బోనకల్,సెప్టెంబర్ 12,డీడీ9 వార్త:**

బోనకల్ మండలంలో ప్రీ ప్రైమరీ బోధకుల నియామక వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకే పోస్టుకు ముందుగా ఓ మహిళకు నియామక ఉత్తర్వులు జారీ చేసి,అపాయింట్‌మెంట్ లెటర్ అందించి,ఆమెతో సుమారు 40 రోజుల పాటు విధులు నిర్వహింపజేసిన అనంతరం అదే పోస్టుకు మరో మహిళను ఎలా నియమించారన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి.ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో మండల త్రిసభ్య కమిటీలో ఉన్న తాహసిల్దార్,ఎంపీడీవో,ఎంఈఓల స్థాయి అధికారుల తీరుపై పలువురు అభ్యర్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రీ ప్రైమరీ బోధకుల నియామకాలను చేపట్టిన సంగతి తెలిసిందే అది కూడా ఇంటర్మీడియట్ అర్హతతో పాటు సమానమైన కోర్సు అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసుకోవాల్సి ఉంది..అయితే బోనకల్ ప్రాథమిక పాఠశాలలో మాత్రం ఒకే పోస్టుకు సంబంధించి వరుసగా రెండు నిర్ణయాలు వెలువడటం తీవ్ర చర్చకు దారితీస్తుంది.

మొదట బోనకల్ గ్రామానికి చెందిన ఓ అర్హత కలిగిన మహిళను ప్రీ ప్రైమరీ బోధకురాలిగా త్రి సభ్య కమిటీ సభ్యులు ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె సుమారు 40 రోజుల పాటు విధులు నిర్వహించారు.అయితే ఆ తర్వాత అదే పోస్టుకు మరో మహిళను నియమించినట్లు విద్యాశాఖ అధికారి తెలిపినట్లు ఇతర అభ్యర్థులు పేర్కొంటున్నారు. దీంతో అసలు మొదటి నియామకం ఎందుకు జరిగింది? 40 రోజుల తర్వాత దానిని ఎందుకు మార్చాల్సి వచ్చింది? రెండో నియామకానికి ప్రాతిపదిక ఏమిటి? అనే ప్రశ్నలు ప్రస్తుతం తలెత్తుతున్నాయి.

**ఒకే పోస్టుకు రెండు నిర్ణయాలెలా? త్రిసభ్య కమిటీ సభ్యుల తీరుపై అనుమానాలు వ్యక్తం:**

నియామక ప్రక్రియలో అర్హత,మెరిట్, నిబంధనలు, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత త్రి సభ్య కమిటీ లో గల అధికారులపై ఉంటుంది.ముఖ్యంగా విద్యార్హత పత్రాలను పరిశీలించి,అర్హతలు నిర్ధారించిన అనంతరం నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లయితే, వాటిని కొద్ది రోజులకే మార్చాల్సిన అవసరం ఎందుకు ఏర్పడిందో స్పష్టత ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

మొదటి అభ్యర్థి అర్హత కలిగిన వ్యక్తే అయితే ఆమె నియామకాన్ని ఎందుకు మార్చారు? అర్హతలో ఏదైనా లోపం ఉంటే, దానిని నియామకానికి ముందే ఎందుకు గుర్తించలేకపోయారు?రెండో అభ్యర్థిని ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు?ఎంపికలో మెరిట్‌కు ప్రాధాన్యం ఇచ్చారా?నిబంధనల ప్రకారమే నిర్ణయం తీసుకున్నారా? అనే ప్రశ్నలకు విద్యాశాఖ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆశావహులు అంటున్నారు.

**40 రోజుల విధుల తర్వాత మార్పు ఎందుకు?**

ఒకసారి నియామక ఉత్తర్వులు జారీ చేసి,అభ్యర్థితో విధులు నిర్వహింపజేసిన తర్వాత అదే పోస్టుకు మరో వ్యక్తిని నియమించడం సాధారణ ప్రక్రియ కాదని పలువురు ఆశావహులు పేర్కొంటున్నారు. నియామకంలో మార్పు చేయడానికి ఏ నిబంధన ఆధారంగా నిర్ణయం తీసుకున్నారు? ఎవరి ఆదేశాల మేరకు మార్పు జరిగింది? మొదటి నియామకాన్ని రద్దు చేసినట్లు అధికారికంగా ఏమైనా ఉత్తర్వులు జారీ చేశారా? అనే అంశాలను ఉన్నతాధికారులు పరిశీలించాలని వారు కోరుతున్నారు.

ఈ వ్యవహారంతో మొదట నియమితులైన మహిళకు ఉద్యోగ పరంగా నష్టం వాటిల్లిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మరోవైపు ప్రస్తుతం నియమితులైన రెండో బోధకురాలి ఉద్యోగ భవిష్యత్తుపైనా అనిశ్చితి నెలకొనే పరిస్థితి ఉందని పలువురు అంటున్నారు.ఒకసారి నిర్ణయం మార్చిన పరిస్థితిలో భవిష్యత్తులో మళ్లీ నిర్ణయం మారదనే హామీ ఏమిటనే ప్రశ్న కూడా తలెత్తుతోంది.

**జిల్లా ఉన్నతాధికారుల జోక్యం తప్పనిసరి:**

బోనకల్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ బోధకురాలి నియామకానికి సంబంధించిన పూర్తి రికార్డులను జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలించాలని బాధితులతో పాటు పలువురు అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.మొదటి నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు, అపాయింట్‌మెంట్ లెటర్, అభ్యర్థుల విద్యార్హతలు,మెరిట్ వివరాలు,రెండో నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు,నియామకం మార్చడానికి గల కారణాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఒకే పోస్టుకు ముందుగా ఒకరిని నియమించి.. 40 రోజుల తర్వాత మరొకరికి అవకాశం కల్పించిన వ్యవహారంలో అసలు కారణమేంటి? నిబంధనల ప్రకారమే నియామకాలు జరిగాయా? లేక అధికారుల నిర్ణయాల్లో లోపాలున్నాయా? అన్నది ఉన్నతస్థాయి విచారణతో తేల్చాలని ఆశావహులు డిమాండ్ చేస్తున్నారు. నియామక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకున్నా అందుకు బాధ్యులపై చర్యలు తీసుకుని,అర్హత మరియు మెరిట్ ఆధారంగా న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.






## శివనామస్మరణతో మారుమోగిన బోధన్ శ్రీ ఏక చక్రేశ్వరాలయం

**బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**

శ్రావణ మాసం ముగింపును పురస్కరించుకుని బోధన్ పట్టణంలోని చారిత్రాత్మక శ్రీ ఏక చక్రేశ్వరాలయంలో శనివారం ప్రత్యేక పూజలు కన్నులపండువగా సాగాయి. నెల రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అభిషేకాలు, ఉపవాసాలు, భజన కార్యక్రమాలు శ్రావణ సమాప్తి పూజలతో వైభవంగా ముగిశాయి. వేదపండితులు గణేష్ శర్మ, అర్చకులు మహేష్ పాఠక్, శివకుమార్‌ల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, విశేష మంగళహారతులు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మధ్యాహ్నం మహా మంగళ హారతి అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ ఎన్.రాములు, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు లక్ష్మణ్ రావు పటేల్, ఆరుగొండ శంకర్, సున్నం గంగాధర్, జక్కం వీరప్ప, ఈరపురం మౌనిక పోశెట్టి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.





## ఉపాధ్యాయులకు సమాజంలో అత్యున్నత స్థానం

- **లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో గురుపూజోత్సవం**
- **11 మంది ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**

సమాజంలో గురువులకు అత్యున్నత స్థానం ఉందని, వారి సేవలు వెలకట్టలేనివని లయన్స్ ఇంటర్నేషనల్ ఎంపీ 320 జీఎంటీ లయన్ పి.బసవేశ్వరరావు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ లక్ష్మీ పేర్కొన్నారు. బోధన్ సరస్వతీ నగర్‌లోని విజేత జూనియర్ కళాశాల ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువులను గౌరవిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో సంస్థ ముందుంటుందని చెప్పారు. ఎంఈఓ పి.నాగయ్య మాట్లాడుతూ... ఉపాధ్యాయులు నూతన డిజిటల్ పద్ధతులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యాబోధన చేయాలని సూచించారు. అనంతరం విద్యా రంగానికి సేవలు అందిస్తున్న 11 మంది ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు దుర్గారావు, చార్టర్ ప్రెసిడెంట్ శంకర్, రీజియన్ చైర్మన్ రంగారావు, జోన్ చైర్మన్ జెరూష, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ట్రెజరర్ భగవాన్ కైలాసప్ప, విజేత కళాశాల డైరెక్టర్ రమణారెడ్డి, శ్రీధర్, శ్యామ్ సుందర్ పహాడే తదితరులు పాల్గొన్నారు.







# ప్రజాపాలనతోనే పల్లెల అభివృద్ధి సాధ్యం

- **సర్పంచుల చేరికతో మరింత బలపడనున్న బజార్హత్నూర్ కాంగ్రెస్ పార్టీ**
- **కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎంపీ సోయం.బాపురావు**

**బజార్ హత్నూర్ 12 సెప్టెంబర్ ( డిడి9 వార్త న్యూస్ ):**

శనివారం ఆదిలాబాద్ లోని సోయం. బాపురావు నివాసంలో బజార్హత్నూర్ మండలానికి చెందిన పలువురు సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు చేరుతున్న సంక్షేమ పథకాలు, మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని బజార్హత్నూర్ మండలం గిరిజాయి, భూతాయి కే, ధర్మపురి సర్పంచులు తెలియజేశారు.గిరిజాయి సర్పంచ్ పెందూర్.అరవింద్, భూతాయి కే సర్పంచ్ మడావి.జైతు, ధర్మపురి సర్పంచ్ ఆర్క.యాదవరావు, సీనియర్ నాయకులు కుమ్ర. మారుతి మాజీ ఎంపీ సోయం. బాపురావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయం.బాపురావు మాట్లాడుతూ గతంలో మరియు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే బజార్హత్నూర్ మండలంలోని గిరిజన గ్రామాలు అన్నింటికీ రోడ్డు సౌకర్యం, ఇందిరమ్మ ఇల్లు, పోడు భూములకు పట్టాలు అందాయని, 10 సం.ల బిఆర్ఎస్ పాలనలో బజార్హత్నూర్ మండలానికి చేసిన అభివృద్ధి శూన్యమని ఆయన విమర్శించారు. కొంతమంది నాయకులు బజారత్నూర్ మండలానికి ఎటువంటి అభివృద్ధి చేయకపోయినా సోషల్ మీడియాలో హడావుడి చేస్తున్నారని ఎవరి క్షేత్రస్థాయి పరిస్థితి ఏమిటో ఈ చేరికలే తెలుపుతున్నాయని తెలిపారు.మూడు గ్రామ పంచాయతీలో సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరడం వల్ల కాంగ్రెస్ పార్టీకి మరింత అదనపు బలం చేపడుతుందని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో బజార్హత్నూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల. చంటి, మాజీ బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు.గంగారెడ్డి, అందుర్ గ్రామ సర్పంచ్ పెందూర్.పృథ్వీరాజ్, మైనార్టీ సీనియర్ నాయకులు షేక్. మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.







# సమన్వయంతోనే గణేష్ ఉత్సవాల విజయం : ఏసీపీ శ్రీనివాస్

- **సమన్వయంతోనే గణేష్ ఉత్సవాల విజయం : ఏసీపీ శ్రీనివాస్**
- **సాలూర టీటీడీ కల్యాణ మండపంలో అధికారుల సమన్వయ సమావేశం**
- **నిబంధనలు విధిగా పాటించాలి: సీఐ, తహసీల్దార్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**

రాబోయే గణేష్ ఉత్సవాలను ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. సాలూర మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో వినాయక మండపాల నిర్వాహకులు, పీస్ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి వస్తున్న ఈ సాంప్రదాయ పండుగ పవిత్రతను, విశిష్టతను కాపాడుకుంటూ వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఏసీపీ పిలుపునిచ్చారు. మండపాల వద్ద నాణ్యమైన విద్యుత్ వైరింగ్ మాత్రమే వాడాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ లైన్ల నుంచి నేరుగా కనెక్షన్లు తీసుకోకూడదని సూచించారు. విద్యుత్ శాఖ లైన్‌మెన్ల సమక్షంలోనే అధికారికంగా కనెక్షన్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 15 నుంచి 20 అడుగుల పెద్ద విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లే సమయంలో మార్గమధ్యంలో కేబుల్, విద్యుత్ వైర్లు తగిలే ప్రమాదం ఉన్నందున అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. మండపాల వద్ద రాత్రి వేళల్లో అఖండ దీపాలు వెలుగుతుంటాయి కాబట్టి, ప్రమాద నివారణకు కనీసం ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులు రాత్రి పూట అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

**ఈత వచ్చిన వారే చెరువు వద్ద ఉండాలి: బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు**

బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు మాట్లాడుతూ.. పండుగ వేళ ఎక్కడైనా సమస్య ఉంటే ముందుగానే పోలీసులకు తెలిపితే వెంటనే పరిష్కరిస్తామన్నారు. గణేష్ ఉత్సవాల ముఖ్య ఉద్దేశం ప్రజలందరి మధ్య ఐక్యతను పెంపొందించడమేనని తెలిపారు. నిమజ్జనం సమయంలో మద్యం సేవించడాన్ని పూర్తిగా నివారించాలని పిలుపునిచ్చారు. చెరువు వద్ద నిమజ్జనం చేసే సమయంలో అలర్ట్‌గా ఉండేందుకు ఈత వచ్చిన నలుగురు లేదా ఆరుగురు సభ్యులు మాత్రమే అక్కడ ఉండాలని సూచించారు.

**న్యూసెన్స్‌కు తావునివ్వొద్దు: సాలూర తహసీల్దార్ అజ్మత్ నవాజ్**

వర్షాకాలం దృష్ట్యా మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్గనైజర్లు క్షుణ్ణంగా పరిశీలించాలని తహసీల్దార్ అజ్మత్ నవాజ్ కోరారు. దేవుడిని సంతృప్తి పరిచే పండుగ వాతావరణంలో మద్యం తాగడం, పేకాట ఆడడం వంటి న్యూసెన్స్ చేయవద్దని స్పష్టం చేశారు. నిమజ్జనం తీసుకెళ్లే వాహనాలు కండిషన్‌లో ఉన్నాయో లేదో చూసుకోవాలని, వాహన డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి ఉండకూడదని తెలిపారు. బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ.. నడిరోడ్లపై మండపాలు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించవద్దని కోరారు. పెద్ద విగ్రహాల రవాణా, నిమజ్జనం కష్టంతో కూడుకున్నందున వీలైనంత వరకు చిన్న విగ్రహాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఏఈ కళ్యాణ్, స్థానిక పోలీసు సిబ్బంది, పీస్ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.





# మార్కండేయ మందిర పునఃనిర్మాణానికి భూమిపూజ

**బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**

ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామంలోని మార్కండేయ మందిర పునఃనిర్మాణ పనులకు శనివారం భూమిపూజ నిర్వహించారు. మందిర అధ్యక్షుడు చిలుక వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. మందిర నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు విట్టల్, చిలుక నారాయణ, ప్రవీణ్, లక్ష్మణ్, మల్లేష్, నగేష్, అనంత స్వామి తదితరులు పాల్గొన్నారు.



# కామ్రేడ్ సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయం

**బోధన్, , సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**

సీపీఎం పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం బోధన్ మండలంలోని ఏరాజ్ పల్లిలో ఆ పార్టీ కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నిజామాబాద్ జిల్లా కమిటీ సభ్యుడు ఏషాల గంగాధర్ మాట్లాడారు. ప్రజల కోసం, సీపీఎం పార్టీ బలోపేతం కోసం ఏచూరి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజ్యసభ సభ్యుడిగా రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, విద్యార్థుల సమస్యలపై పార్లమెంటులో నిరంతరం గళమెత్తారని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా వామపక్ష ఉద్యమాల బలోపేతానికి ఏచూరి ఎంతో కృషి చేశారని, ఆయన ఆశయ సాధనకు నిరంతరం శ్రమించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఏరియా కమిటీ సభ్యుడు కుప్రియాల బాలయ్య, మండల కమిటీ సభ్యులు దాసారం ప్రకాష్, నల్ల సాయిలు, ఆసరి లింగం, దండు సాయిలు, శ్రీనివాస్, బోయి సాయిలు, రాజేందర్, ఎగొండ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

- **ప్రతి వారం – ప్రతి శనివారం**
- **ఈ వారం 143వ వారం**
- **రామాలయం – సోనాల**

**ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 12: (డిడి 9 వార్త న్యూస్):**

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న విద్యార్థులకు మరియు భక్తులకు ప్రసాదాన్ని వితరణ చేసినందుకు హృదయపూర్వక ధన్యవాదములు.

ప్రసాద వితరణ దాతలు
జనకొండ లలిత - ఆశన్న దంపతులు
(జై శ్రీరామ్ కిరాణా, సోనాల)
బాశెట్టి లక్ష్మి - శంకర్ దంపతులు
(ఎ డబ్ల్యూ టి)
రామాయి రూప - ప్రవీణ్ దంపతులు

మీ సేవాభావానికి, భక్తి కార్యక్రమానికి అందించిన సహకారానికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

జై శ్రీరామ్
హనుమాన్ చాలీసా పారాయణం
హిందూ జాగరణ మండలి - సోనాల





# మానవత్వానికి నిదర్శనం అన్నదానం శివానంద శివాచార్య మహారాజ్

- **బోధన్ పట్టణం జంగంగల్లీ వైభవంగా శ్రావణమాస ఉద్దీపన కార్యక్రమం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**

ఆకలితో ఉన్నవారి కడుపు నింపే అన్నదానం అన్ని దానాల్లోకెల్లా అత్యంత విశిష్టమైనదని, దైవచింతనతో పాటు సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మహారాష్ట్ర తామ్లూర్ సంస్థానానికి చెందిన షటస్థల బ్రహ్మ 108 శ్రీశ్రీశ్రీ శివానంద శివాచార్య మహారాజ్ కోరారు. బోధన్ పట్టణంలోని జంగంగల్లీ పురాణే మఠం ఆధ్వర్యంలో శ్రావణమాస ఉద్దీపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శివానంద శివాచార్య మహారాజ్ హాజరై భక్తులకు దివ్యానుగ్రహ భాషణం చేశారు. వీరశైవులకు తమ సంస్కృతీ సాంప్రదాయాలను తర్వాతి తరాలకు అందించడంలో పురాణే మఠం కృషి ప్రశంసనీయమన్నారు. వరుసగా 18 ఏళ్లుగా నెల రోజుల పాటు రుద్రాభిషేకాలు నిర్వహించి, భాద్రపద శుద్ధ పాడ్యమి నాడు ఉద్దీపన వేడుక చేయడం ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. అనంతరం దంపతులు పొడయ్య రాజేందర్, అంబెల్లి వీరప్పలు స్వామిజీకి ఘనంగా పాదపూజ చేశారు. భజన బృందాల కీర్తనలు భక్తులను అలరించాయి. ఉత్సవం ముగింపులో భక్తులకు పెద్ద ఎత్తున మహాప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో పురాణే అజయ్ కుమార్, సిద్ధిలింగప్ప మహారాజ్, సంతోష్ మహారాజ్, అర్చకులు జంగం శివరాజప్ప, వీరశైవ ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.



# పర్యావరణ రక్షణకు మట్టి గణపతులనే వాడాలి

- **- మట్టి విగ్రహాల ఉచిత పంపిణీని ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ భుజంగారావు**

**నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**

పర్యావరణ రక్షణలో భాగస్వాములై ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ భుజంగారావు పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా శనివారం నిజామాబాద్ ఎస్ఆర్ఎస్పీ సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పర్యావరణ ఇంజనీర్ రవిదాస్ మాట్లాడుతూ.. టీజీపీసీబీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 8 అంగుళాల మట్టి గణపతులను ఉచితంగా అందజేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీసీబీ సిబ్బంది, ఇతర శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.




# పిల్లల ప్రవర్తనపై కన్ను వేసి ఉంచాలి : ఈగల్ ఫోర్స్

- **లింబాద్రిగుట్ట దేవస్థానంలో అవగాహన సదస్సు**

**నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**

గ్రామాల్లోకి చొచ్చుకొచ్చిన మత్తు పదార్థాలను తరిమికొట్టి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఈగల్ ఫోర్స్ అడ్వైజర్ కొండవీటి శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం భీంగల్ మండలం లింబాద్రిగుట్ట లక్ష్మీనారసింహస్వామి ఆలయ ప్రాంగణంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. డ్రగ్స్ మహమ్మారి వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. భీంగల్ ఎస్సై శంకర్ మాట్లాడుతూ గంజాయి సేవించినా, విక్రయించినా ఊపేక్షించేది లేదని హెచ్చరించారు. గంజాయి అక్రమ విక్రయాలపై సమాచారం తెలిపిన వారి వివరాలు గుప్తంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ ప్రతినిధులు ఉట్నూర్ సాగర్, అడ్వాల శ్రీనివాస్, పంతుల మనోహర్, అనిల్ కుమార్, నాగరాజు, శ్రీనివాస్, ఎస్సై తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# పబ్లిక్ న్యూసెన్స్ చేస్తే సహించేది లేదు: సీపీ పి.సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 12(డీడీ9 వార్త) :**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వేళ డీజే సౌండ్ ఉపయోగించిన నిర్వాహకులపై కేసు నమోదు చేసి, సౌండ్ సిస్టమ్‌ను సీజ్ చేసినట్లు బాల్కొండ పోలీసులు శనివారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో గణేష్ ఆగమన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దంతో డీజే మోగించారు. శబ్ద కాలుష్యంతో పాటు పబ్లిక్ న్యూసెన్స్‌కు కారణమైనందుకు సంబంధిత నిర్వాహకులపై కేసు నమోదు చేసి, డీజే పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా అధిక శబ్దంతో డీజేలు ఉపయోగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, డీజేలకు ఎలాంటి అనుమతి లేదని తేల్చిచెప్పారు. గణేష్ మండపాల నిర్వాహకులు చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

# జానకంపేట్ దొంగతనం కేసులో నిందితుడి రిమాండ్

**బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 12(డీడీ9 వార్త ) :**



కిరాణ షాపులో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎడపల్లి ఎస్సై రమ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... జానకంపేట్ గ్రామానికి చెందిన పోలపల్లి వీరేశం కిరాణ షాపులో ఈ నెల 8న అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ₹7 వేల నగదు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన గద్ద గంగారంను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి ₹1,500 నగదు స్వాధీనం చేసుకుని బోధన్ కోర్టులో హాజరుపర్చగా, కోర్టు ఆదేశాల మేరకు జుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.




# బోథ్ మండల కాంగ్రెస్‌కు నూతన కమిటీలు

- **పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తాం: అలపాటి అచ్యుతానంద్ రెడ్డి**

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 12: (డిడి 9 వార్త న్యూస్):**

కాంగ్రెస్ పార్టీని బోథ్ మండలంలో గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో నూతన మండల కమిటీలను ఏర్పాటు చేసినట్లు బోథ్ మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అలపాటి అచ్యుతానంద్ రెడ్డి తెలిపారు.

ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్, మండల కాంగ్రెస్ కన్వీనర్ మెరుగు భోజన్న సమన్వయంతో ఈ నియామకాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సంఘటన్ సృజన్ అభియాన్ మార్గదర్శకాల మేరకు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ఈ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

**మండల కాంగ్రెస్ కమిటీ**

అధికార ప్రతినిధి: అలపాటి అచ్యుతానంద్ రెడ్డి .ఉపాధ్యక్షులు: నాదికుంట ప్రవీణ్, మహమ్మద్ రఫీ

జనరల్ సెక్రటరీలు: బుర్గుల్లా సందీప్, ఎస్.కె. అబోద్, సున్నపు శ్రీనివాస్, జాదవ్ ఉమేష్

సెక్రటరీలు: బద్దం దినేష్ రెడ్డి, చౌహాన్ దేవిదాస్, కొట్టాల గంగారెడ్డి, ఆదెం దశరథ్, భీమా బుచ్చన్న, రాథోడ్ రాజేష్, పందుల నీరజ

ఎగ్జిక్యూటివ్ సభ్యులు: నైతం వనిత, అల్లి శ్రీవాణి, బండారి గంగాధర్, కొడప రవీందర్, దొంగరి జగన్, మాదవి లక్ష్మణ్*

బోథ్ మండల రాజకీయ వ్యవహారాల కమిటీ (పి ఎ సి)*

చైర్మన్: మెరుగు భోజన్న సభ్యులు మల్లేపుల సత్యనారాయణ, బుర్గుల మల్లేష్, రాజు యాదవ్, పసుపుల చంటి, షేక్ మహమ్మద్, చాట్ల ఉమేష్, బొడ్డు గంగారెడ్డి, నల్ల శ్రీకాంత్ రెడ్డి, ఇటేడి సత్యనారాయణ రెడ్డి, మాల్యాల అంజయ్య, రాథోడ్ రమేష్, రజియా బేగం షేక్, వి. సురేందర్, సురుగుల భోజ్జా రెడ్డి.

ఈ సందర్భంగా అలపాటి అచ్యుతానంద్ రెడ్డి మాట్లాడుతూ తనకు మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.

నూతనంగా నియమితులైన నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ బోథ్ మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు, పార్టీకి మధ్య వారధిగా పనిచేస్తానని అచ్యుతానంద్ రెడ్డి పేర్కొన్నారు.




# తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలోకి జోరుగా చేరికలు

- **ఇచ్చోడ మండలానికి చెందిన పలువురు కార్యకర్తలకు కండువాలు కప్పి ఆహ్వానం**

**ఆదిలాబాద్ జిల్లా:( బ్యూరో): సెప్టెంబర్ 12: (డిడి 9 వార్త న్యూస్):**

హైదరాబాద్, సెప్టెంబర్ 12: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శ్రీ రాథోడ్ బాపురావు తెలిపారు. ఈ రోజు హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని (నందినగర్) లో ఉన్న టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఇచ్చోడ మండలానికి చెందిన బి ఆర్ ఎస్,కాంగ్రెస్ పలువురు కార్యకర్తలు టి ఆర్ ఎస్ పార్టీలో చేరారు. శ్రీ రాథోడ్ బాపురావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్ )పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితక్క వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన కార్యకర్తలకు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం బోథ్ నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిపై కల్వకుంట్ల కవితక్క వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలాల వారీగా పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల భాగస్వామ్యం, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో బోథ్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని శ్రీ రాథోడ్ బాపురావు సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, ఇచ్చోడ మండలానికి చెందిన నూతనంగా పార్టీలో చేరిన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# 78వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 12: (డిడి 9 వార్త న్యూస్)**

తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఈ నెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న సందర్భంగా, అందులో భాగంగా సెప్టెంబర్ 16వ తేదీన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది.

ఈ సందర్భంగా కార్మికులు, కర్షకులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాము.

సెప్టెంబర్ 16న బోథ్‌లోని నిర్ణయించిన ప్రదేశంలో అందరూ సకాలంలో హాజరై, అక్కడి బోథ్ బస్టాండ్ నుండి అమరవీరుల స్తూపం వరకు ర్యాలీగా తరలివెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నాము. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను స్మరించుకుంటూ నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరుతున్నాము.

ఇట్లు
సిపిఐ మండల్ సమితి

# ప్రజాపాలనతోనే పల్లెల అభివృద్ధి సాధ్యం

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ఆకర్షణ పథకాలు వచ్చి కాంగ్రెస్ లో చేరుతున్నాం**
- **సర్పంచుల చేరికతో మరింత బలపడనున్న బజార్హత్నూర్ కాంగ్రెస్ పార్టీ**
- **కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎంపీ సోయం బాపురావు**

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 12: (డిడి 9 వార్త న్యూస్):**

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు చేరుతున్న సంక్షేమ పథకాలు, మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని బజార్హత్నూర్ మండలం గిరిజాయి, భూతాయి కే, ధర్మపురి సర్పంచులు తెలియజేశారు

గిరిజాయి సర్పంచ్ పెందూర్ అరవింద్, భూతాయి కే సర్పంచ్ మదావి జైతు, ధర్మపురి సర్పంచ్ ఆర్క యాదవరావు, సీనియర్ నాయకులు కుమ్ర మారుతి మాజీ ఎంపీ సోయం బాపురావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు*

ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ గతంలో మరియు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే బజార్హత్నూర్ మండలంలోని గిరిజన గ్రామాలు అన్నింటికీ రోడ్డు సౌకర్యం, ఇందిరమ్మ ఇల్లు, పోడు భూములకు పట్టాలు అందాయని, 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో బజార్హత్నూర్ మండలానికి చేసిన అభివృద్ధి శూన్యమని ఆయన విమర్శించారుకొంతమంది నాయకులు బజారత్నూర్ మండలానికి ఎటువంటి అభివృద్ధి చేయకపోయినా సోషల్ మీడియాలో హడావుడి చేస్తున్నారని ఎవరి క్షేత్రస్థాయిపరిస్థితి ఏమిటో ఈ చేరికలే తెలుపుతున్నాయని తెలిపారు *మూడు గ్రామపంచాయతీలో సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరడం వల్ల కాంగ్రెస్ పార్టీకి మరింత అదనపు బలం చేపడుతుందని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో బజార్హత్నూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మాజీ బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, అందూర్ గ్రామ సర్పంచ్ పెందూర్ పృథ్వీరాజ్, మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు*



# ఘనంగా శబరిమాత అక్కడ జ్యోతి ముగింపు కార్యక్రమం

- **బోథ్ మండలం కనుగుట్ట గ్రామంలో 31 రోజులుగా కొనసాగిన శబరి మాత అఖండ జ్యోతి**

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 12: (డిడి 9 వార్త న్యూస్):**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం లోని కనుగుట్ట గ్రామంలో శబరిమాత అఖండ జ్యోతి ముగింపు మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా ముగిసింది. ముగింపు వేడుకలకు భక్తులు భారీగా తరలిరావడంతో గ్రామం భక్త సాగరంగా మారింది. మహిళల సంప్రదాయ కోలాటాలు, భజనలు, దైవనామస్మరణలతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఈ కార్యక్రమం ప్రజల్లో భక్తిభావంతో పాటు ధర్మం, మానవ విలువలు, గ్రామ ఐక్యతను పెంపొందించింది .ఈ ముగింపు వేడుకలకు మాజీ మంత్రి జోగు రామన్న, రాష్ట్ర అధ్యాపకుల సంఘ ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ సహా పలువురు ప్రజాప్రతినిధులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు ప్రార్థించారు. అనంతరం తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ముగింపు అనంతరం అఖండ జ్యోతిని భక్తులు మంగళహారతులు, జై శబరి మాత నినాదాల నడుమ మహారాష్ట్రలోని సాంగ్వి గ్రామానికి సాగనంపారు. గ్రామస్తులు, యువత, భక్తుల సమష్టి సహకారంతోనే ఈ మహోత్సవం విజయవంతమైందని నిర్వాహకుడు మునిగెల రమణ పేర్కొంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.





# తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు మురళి కి సన్మానం

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 12: (డిడి 9 వార్త న్యూస్):**

అఖిల భారత పద్మశాలి సంఘం మరియు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, పద్మశాలి ప్రజాప్రతినిధులను గౌరవించిన తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు మురళి బోథ్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు మేరుగు భోజన్న, ఆలయ కమిటీ అధ్యక్షులు సిరిపురం చందు, కోశాధికారి కటకం నాగేష్, తడక పోశెట్టి, ఉసికల కార్తీక్ కలిసి శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా పద్మశాలి సమాజ అభ్యున్నతికి చేస్తున్న కృషికి మురళి కి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

జై పద్మశాలి సమాజం

# హలో ఆదివాసీ.. ఛలో ఉట్నూర్

- **సెప్టెంబర్ 16న ఉట్నూర్ ఐ టి డి ఎ ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయాలి**
- **కొమరం భీమ్ విగ్రహానికి నివాళులర్పించి కరపత్రం పోస్టర్ ఆవిష్కరణ చేసిన తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా. మైపతి అరుణ్ కుమార్**

**ఆదిలాబాద్ జిల్లా: సొనాల మండలం: సెప్టెంబర్ 12: (డిడి 9 వార్త న్యూస్):**

సెప్టెంబర్ 16న నిర్వహించనున్న ఉట్నూర్ ఐ టి డి ఎ ఆదివాసీ మార్చ్-ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ తుడుం దెబ్బ నాయకులు ఆదిలాబాద్ జిల్లాలో విస్తృత పర్యటన చేపట్టారు.

పర్యటనలో భాగంగా సోనాల మండలంలో కొమరం భీమ్ విగ్రహానికి తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్క బాబురావు, జిల్లా అధ్యక్షులు పెందూర్ దాదిరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

తుడుం దెబ్బ ప్రధాన డిమాండ్లు

ఎస్ టి జాబితా నుంచి లంబాడీలను తొలగించాలి ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను నియమించాలి

ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాలను ఐ టి డి ఏ ల ద్వారానే భర్తీ చేయాలి

ఆదివాసీల పోడు భూములకు 2005 అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలి

**5వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీ హక్కులను కాపాడాలి**

ఈ సందర్భంగా తుడుం దెబ్బ నాయకులు మాట్లాడుతూ, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తాం

"తుడుం దెబ్బ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలి. ఆదివాసీల హక్కుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తాం" అని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా. మైపతి అరుణ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్క బాబురావు, జిల్లా అధ్యక్షులు పెందూర్ దాదిరావు, మండల నాయకులు హెచ్చరించారు.

హలో ఆదివాసీ.. ఛలో ఉట్నూర్! సెప్టెంబర్ 16 - ఐ టి డి ఏ ఆదివాసీ మార్చ్. ఆదివాసీ హక్కుల కోసం.. ఐక్యంగా కదలుదాం!



# పలు కుటుంబాలను పరామర్శించిన ఆడే గజేందర్

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 12: (డిడి 9 వార్త న్యూస్):**

బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ బోథ్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు.

పోచ్చెర గ్రామంలో: శ్రీకాంత్ రెడ్డి తల్లి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ధన్నూర్ గ్రామంలో: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ చాకలి అడేళ్లు తండ్రి చాకలి బాపు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అదేవిధంగా ధన్నూర్ గ్రామంలోనే కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చిట్యాల రాజు తల్లి చిట్యాల అడెల్ల గార్ల కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆడే గజేందర్ తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనారు



హెల్త్

# వేడి నీళ్లతో ఎన్నో లాభాలు



ప్రతిరోజూ వేడి నీళ్లు తాగితే ఆరోగ్యానికి చాలామంచిది అంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ఇప్పటికే చాలామందికి ఈ అలవాటు ఉండే ఉంటుంది. ఒకవేళ అలవాటు లేకపోతే ఇప్పటి నుంచి అలవర్చుకోండి. ఎందుకంటే ఇలా రోజూ పరగడుపున వేడినీళ్లు తాగడం వల్ల బోలెడన్ని లాభాలున్నాయి.

**జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది**
వేడి నీరు ఆహార కణాల విచ్ఛిన్నం చేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కడుపు కండరాలకు విశ్రాంతి, ఉపశమనాన్ని కలిగిస్తుంది. ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది.

**గొంతు నొప్పిని తగ్గిస్తుంది**
వేడి నీళ్లలో తేనె, నిమ్మకాయ కలిపి తాగితే గొంతులో మంట, చికాకును తగ్గిస్తుంది. తద్వారా గొంతు నొప్పిని తగ్గిస్తుంది. గొంతును తేమగా ఉంచుతుంది.

**రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది**
వేడి నీరు రక్త నాళాలను విస్తరించడంలో సాయపడుతుంది. శరీరం అంతటా రక్త ప్రసరణను మెరుగుపరిచేలా చేస్తుంది. కణాలకు మెరుగైన ఆక్సిజన్, పోషకాలని అందిస్తుంది.

**బరువు తగ్గొచ్చు**
బరువు తగ్గించడంలో వేడి నీరు సాయపడుతుంది. శరీరంలో కొవ్వు నిల్వలను విచ్ఛిన్నం చేయడంలో సాయపడుతుంది.

**కండరాల నొప్పికి ఉపశమనం**
వేడి నీరు తాగితే.. కండరాలు రిలీఫ్ అవుతాయి. ఆర్థరైటిస్, కండరాల ఒత్తిడితో సంబంధం ఉన్న నొప్పిని తగ్గించడంలో సాయపడుతుంది. వాపును తగ్గిస్తుంది.అయితే... వేడి నీరు తాగేంత ఉష్ణోగ్రతలో ఉండాలి. విపరీతమైన వేడి నీరు తాగకూడదు. అలా ఉంటే నోరు, అన్నవాహికలలోని సున్నితమైన కణజాలాలకు నష్టాన్ని కలిగిస్తుంది.

## సరికొత్త ప్రయోగం..

# మీటీ రైస్!



ఆవిష్కరణ



మనం తినే అన్నంలో కార్బోహైడ్రేట్లు ఎక్కువ, ప్రోటీన్లు తక్కువ. దీంతో డయాబెటీస్ లాంటి సమస్యలు ఉన్నవారు అన్నం తినడం మానేస్తున్నారు. ఒక్క పూట అన్నం తిని మిగతా రెండు పూటలా చపాతీలు, రొట్టెలు లాంటివి తీసుకుంటున్నారు. అయితే చాలా మందికి అన్నం తినకపోతే.. కడుపు నిండినట్టుగా ఉండదు. ఇలాంటి వారి కోసమే దక్షిణ కొరియా సైంటిస్టులు కొత్త రకం బియ్యాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ప్రోటీన్లను ఎక్కువగా అందించేలా 'మీటీ రైస్'ను కొరియన్ శాస్త్రవేత్తలు రూపొందిస్తున్నారు. గులాబీ రంగులో ఉండే ఈ మీటీ రైస్.. పేరుకు తగ్గట్టుగానే ఈ బియ్యంలోకి జంతువుల మాంసాన్ని జొప్పిస్తారు. అయితే ఇందుకోసం నిజమైన జంతువుల మాంసం కాకుండా.. ల్యాబ్‌ల్లో తయారు చేసిన బీఫ్ మాంసం, కొవ్వు కణజాలాలను వాడతారు.

**ఎందుకు తయారుచేశారంటే...**
ఈ కల్చర్డ్ మీట్ ద్వారా శరీరానికి అవసరమైన ప్రోటీన్లను పొందొచ్చని సియోల్‌లోని యోన్సెయ్ యూనివర్సిటీకి చెందిన హాంగ్ అనే పరిశోధకుడు తెలిపారు. ఆసియా దేశాల్లో ఎక్కువ మంది ఆహారంగా వరి అన్నం తింటారు. కాబట్టి ఆర్గనాయిడ్స్, బయోమెడికల్ సైన్సెస్‌లో నిపుణుడైన హాంగ్.. తన పరిశోధన కోసం బియ్యాన్ని ఎంచుకున్నారు.ఈ మీటీ రైస్ తయారీ ప్రక్రియకు సాధారణ బియ్యాన్నే తీసుకొని.. దానికి చేపల నుంచి సేకరించిన గెలటిన్ (ప్రొటీన్) కోటింగ్ వేస్తారు. ఆ తర్వాత ఒక్కో గింజలోకి ల్యాబ్‌ల్లో తయారు చేసిన బీఫ్ కణాలను ఇంజెక్ట్ చేస్తారు. ఇలా బియ్యపు గింజల్లోకి మాంసపు కణాలను ఎక్కించిన తర్వాత అవి ఆ గింజల లోపల అంతటా సమంగా పెరుగుతాయి. సాధారణ బియ్యంతో పోలిస్తే ఈ పింక్ రైస్‌లో 8 శాతం ప్రొటీన్, ఏడు శాతం ఫ్యాట్ అదనంగా ఉంటాయి. ఈ బియ్యాన్ని ఎమర్జెన్సీ రిలీఫ్ ఫుడ్ కింద రెండు ఆఫ్రికా దేశాలకు అందించేందుకు అనుమతులు లభిస్తాయని కొరియా శాస్త్రవేత్తల బృందం ఆశిస్తోంది.

**పేద ప్రజల కోసం..**
కొన్ని దేశాల్లో ప్రజలు పేదరికం రోజుకు ఒక పూట మాత్రమే భోజనం చేయగలుగుతున్నారు. అలాంటి వారిలో ప్రొటీన్ కొంత శాతం పెరిగినా.. అది చాలా మంచిదేనని హాంగ్ చెప్పారు. అయితే దక్షిణ కొరియా ప్రభుత్వం మాత్రం ఇంకా ఈ మీటీ రైస్ వాడకానికి ఆమోదం తెలుపలేదు. కానీ ఇలా కణ మార్పిడి చేసిన (మాంసం) ఆహారంపై పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని.. ఫుడ్‌టెక్ ఫండ్‌లో భారీగా పెట్టుబడులు పెట్టబోతున్నట్టు 2022లో కొరియా ప్రకటించింది.

**ఇటలీ బ్యాన్ చేసింది**
ఇప్పటికే సింగపూర్, అమెరికా మార్కెట్లలో కల్టివేటెడ్ మీట్ అందుబాటులో ఉంది. దీని ప్రభావం మాంసాన్ని ఉత్పత్తి చేసే జంతువులను పెంచే వారిపై ఉండే అవకాశం ఉంటుంది అనే భావనతో కల్టివేటెడ్ మీట్‌ను ఇటలీ గత ఏడాది నిషేధించింది.
కార్బన్ డయాక్సైడ్ తగ్గుతుంది!
ఈ హైబ్రిడ్ రైస్ పట్ల రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నప్పటికీ.. దీని వల్ల కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని, జంతువులను వధించాల్సిన అవసరం ఉండదని హాంగ్ బృందం చెప్తోంది. సంప్రదాయ పద్ధతిలో మాంసాన్ని ఉత్పత్తి చేసే దానికంటే.. ఈ విధానం వల్ల కార్బన్ డయాక్సైడ్ ఉత్పత్తి 8 రెట్లు తగ్గుతుందని హాంగ్ తెలిపారు.

**2040 నాటికి...**
2040 నాటికి ప్రపంచవ్యాప్తంగా వినియోగించే మాంసంలో 40 శాతం మాత్రమే సంప్రదాయ విధానంలో ఉత్పత్తి అవుతుందని.. మిగతా 60 శాతం కల్చర్డ్ మీట్ ఉంటుందని ఏటీ కియర్నీ అనే గ్లోబల్ కన్సల్టెన్సీ అంచనా వేసింది. ఈ టెక్నాలజీతో పాలు, గుడ్డు తెల్లసొన, చేప మాంసాన్ని కూడా ఇలాంటి టెక్నాలజీతో రూపొందించొచ్చని 2019లోనే ఏటీ కియర్నీ తన నివేదికలో పేర్కొంది.
'మరి కొన్నేళ్లు పోతే.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మన కిచెన్లలోకి కూడా వచ్చేస్తుంది. రక్త నమూనాను విశ్లేషించడం ద్వారా సదరు వ్యక్తికి బాగా నప్పే ఆహారాన్ని తయారు చేయాలని రోబోకు ఏఐ సూచనలు చేస్తుంది. ఇలా మన శరీర అవసరాలకు సరిపడే ఆహారాన్ని రోబో వండి మన ముందు ఉంచుతుంది' అని హాంగ్ చెబుతున్నారు.



# యువతలో డయాబెటిస్!

మారుతున్న జీవనశైలి కారణంగా నేటి యువత అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా యువకుల్లో డయాబెటిస్ కేసులు రావడం ఆందోళన కలిగిస్తోంది. అసలు యువతలో డయాబెటిస్ రావడానికి కారణాలేంటి? పరిష్కార మార్గాలేంటో తెలుసుకుందాం.





**జీవనశైలి :**
శారీరక శ్రమ లేకపోవడం, స్క్రీన్ ఎక్కువ సమయం చూడడం వల్ల రావొచ్చు. కాబట్టి .. ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలిని కలిగి ఉండాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఒకేచోట కదలకుండా ఉండకూడదు. రోజూ వాకింగ్ చేయాలి.

**జంక్ ఫుడ్ :**
అధిక క్యాలరీలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోవడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువ. అందుకే ఆహారపు అలవాట్లు, ఆహార ఎంపికల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు, పండ్లు, కూరగాయలతో కూడిన పోషకమైన ఆహారాన్ని తీసుకోవాలి. అదే సమయంలో ప్రాసెస్ చేసిన ఆహారాలను పూర్తిగా తగ్గించాలి.

**ఊబకాయం :**
అధిక శరీర బరువు మధుమేహానికి దారితీస్తుంది. కాబట్టి బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) ఎంత స్థాయిలో ఉందో తెలుసుకోవాలి. సమతుల్య ఆహారంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. హెల్దీ వెయిట్ ఉండేలా చూసుకోవాలి.

**జెనెటిక్స్ :**
మధుమేహం అనేది కుటుంబంలో ఎవరికైనా ఉంటే అది వారసత్వంగా వస్తోంది. దీన్ని ముందుగానే గుర్తించాలి. జన్యుపరమైన కారకాలను మార్చలేనప్పటికీ, ఆరోగ్యకరమైన జీవనశైలి ఇప్పటికీ మధుమేహం ప్రమాదాన్ని తగ్గించడంలో సాయపడుతుంది.

**తగినంత నిద్ర:**
తగినంత నిద్ర లేకపోవడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అందుకే నిద్రకు అధిక ప్రాధాన్యత ఇవ్వండి.

**ఒత్తిడి :**
ఈ రోజుల్లో ఒత్తిడి చాలా ఎక్కువైపోతోంది. అయితే, దీర్ఘకాలిక ఒత్తిడి యువతలో మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి సమతుల్య జీవనశైలిని కలిగి ఉండటంతో పాటు ఒత్తిడిని కంట్రోల్ చేసుకోవాలి.

**అధిక రక్తపోటు :**
హైపర్ టెన్షన్ అని పిలిచే అధిక రక్తపోటు వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువ. కాబట్టి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం, రక్తపోటును కంట్రోల్ చేసుకోవడం వల్ల డయాబెటిస్ రాకుండా ఉంటుంది.





## బుమ్రా వచ్చేశాడు.. సూర్యవంశీకి

# నెట్స్‌లో చుక్కలు!

- ప్రాక్టీస్‌లో అదరగొట్టిన స్టార్ పేసర్ బుమ్రా
- సూర్యవంశీకి వరుసగా యార్కర్లతో పరీక్ష
- ఓ బంతికి సూర్యవంశీ ఎడ్జ్ ఇచ్చిన వైనం
- సుమారు 45 నిమిషాలు పూర్తి తీవ్రతతో బౌలింగ్ చేసిన బుమ్రా
- గాయం తర్వాత ఫిట్‌గా కనిపించిన స్టార్ పేసర్

ప్రజాక్షేత్రం

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా రీఎంట్రీ అదిరిపోయింది. ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు ఢిల్లీలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో బుమ్రా అదరగొట్టాడు. నెట్స్‌లో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి తన బౌలింగ్‌తో గట్టి పరీక్ష పెట్టాడు.

బుమ్రా వేసిన తొలి బంతి యార్కర్. సూర్యవంశీకి కాస్త దూరంగా వెళ్లింది. రెండో బంతికి మంచి లెంగ్త్‌తో బంతిని బయటకు మళ్లించి అతడిని పూర్తిగా బీట్ చేశాడు. మూడో బంతి మరో యార్కర్. ఈసారి సూర్యవంశీ బ్యాట్ దించి బంతిని అడ్డుకున్నాడు. ఆ తర్వాత బుమ్రా వేసిన బంతికి సూర్యవంశీ ఎడ్జ్ ఇచ్చాడు. వికెట్ కీపర్‌కు సులభంగా క్యాచ్ వెళ్లే బంతి కావడంతో బుమ్రా వెంటనే సంబరాలు చేసుకున్నాడు. ఎట్టకేలకు సూర్యవంశీ ఓ ఓవర్‌పిచ్ బంతిని బౌండరీకి తరలించాడు. మొత్తంగా బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కొన్న సమయంలో యువ బ్యాటర్ పెద్దగా దూకుడుగా ఆడలేకపోయాడు.

బుమ్రా సుమారు 45 నిమిషాల పాటు పూర్తి తీవ్రతతో బౌలింగ్ చేశాడు. చాలా కాలం తర్వాత నెట్స్‌లోకి వచ్చినా ఫిట్‌నెస్‌పై ఎలాంటి సందేహాలు లేకుండా కనిపించాడు. గాయం నుంచి కోలుకుని జట్టులోకి తిరిగొచ్చిన బుమ్రాకు ఇది తొలి ప్రాక్టీస్ సెషన్.

ఐపీఎల్‌లో గతంలో బుమ్రా బౌలింగ్‌లోనే సూర్యవంశీ సిక్సర్ కొట్టాడు. ఈసారి మాత్రం నెట్స్‌లో బుమ్రా పైచేయి సాధించాడు. ఢిల్లీ సెషన్‌లో బుమ్రా తీవ్రత




## వైభవ్‌లాంటి ఒక్క బ్యాటర్‌నైనా తయారు చేశారా?.. పాకిస్థాన్‌కు వసీం అక్రమ్ చురకలు

- పీఎస్‌ఎల్‌పై వసీం అక్రమ్ తీవ్ర విమర్శలు
- పదేళ్లలో చెప్పుకోదగ్గ బ్యాటర్ వచ్చారా అని ప్రశ్న
- వైభవ్ సూర్యవంశీని పాకిస్థాన్‌కు ఉదాహరణగా చూపిన వైనం
- యువ బ్యాటర్లను తీర్చిదిద్దడంలో వ్యవస్థ విఫలమైందని వ్యాఖ్య
- క్లబ్ క్రికెట్‌ను పునరుద్ధరించాలని సూచన

ప్రజాక్షేత్రం

పాకిస్థాన్ క్రికెట్ ఎదుర్కొంటున్న సమస్య కేవలం ఓ టెస్టు సిరీస్‌లో ఓటమితో ముగిసేది కాదని మాజీ కెప్టెన్ వసీం అక్రమ్ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఫలితాలను మార్చగల బ్యాటింగ్ ప్రతిభను పాకిస్థాన్ వ్యవస్థ తయారు చేయలేకపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్)పై ఆయన తీవ్ర ప్రశ్నలు సంధించారు.

పీఎస్‌ఎల్ ప్రారంభమై పదేళ్లు పూర్తయినా.. ఈ లీగ్ నుంచి అత్యుత్తమ బ్యాటింగ్ ప్రతిభ ఎందుకు బయటకు రాలేదని అక్రమ్ ప్రశ్నించారు. బౌలర్లను తయారు చేయడంలో లీగ్ కొంతమేర విజయవంతమైందని అంగీకరించిన ఆయన.. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న బ్యాటర్లను మాత్రం తయారు చేయలేకపోయిందన్నారు.

“పీఎస్‌ఎల్ ప్రారంభమై పదేళ్లు అవుతోంది. ఈ లీగ్ నుంచి ఒక్క బ్యాటర్‌నైనా తయారు చేశామా? కొంతమంది బౌలర్లు వచ్చారు. కానీ చెప్పండి.. చెప్పుకోదగ్గ బ్యాటింగ్ ప్రతిభను ఎవరినైనా తయారు చేశామా?” అని అక్రమ్ ప్రశ్నించారు.

ఈ సందర్భంగా భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు. చిన్న వయసులోనే సీనియర్ క్రికెట్‌లోకి దూసుకొచ్చిన సూర్యవంశీ తరహా బ్యాటింగ్ ప్రతిభ పాకిస్థాన్ నుంచి కూడా రావాల్సిన అవసరం ఉందన్నారు. “14 ఏళ్ల సూర్యవంశీ లాంటి బ్యాటింగ్ ప్రతిభ మనం తయారు చేసినప్పుడు పాకిస్థాన్ క్రికెట్‌లో మార్పు కనిపిస్తుంది” అని చెప్పారు.

అక్రమ్ విమర్శలు పీఎస్‌ఎల్‌కే పరిమితం కాలేదు. దేశవాళీ వ్యవస్థను బలోపేతం చేయాలని, క్లబ్ క్రికెట్‌ను తిరిగి పునరుద్ధరించాలని సూచించారు. కరాచీ, లాహోర్‌లో ప్రతిచోటా రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టాలని పీసీబీకి సూచించారు. ప్రతిభ గుర్తించేందుకు ఈ నగరాలే కీలకమని చెప్పారు. పునర్వ్యవస్థీకరించిన దేశవాళీ వ్యవస్థకు తరచూ మార్పులు చేయకుండా కనీసం మూడేళ్ల నుంచి నాలుగేళ్ల సమయం ఇవ్వాలని కోరారు.

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో పాకిస్థాన్ బ్యాటింగ్ వైఫల్యాలపైనా అక్రమ్ స్పందించారు. రాబిన్సన్ వంటి బౌలర్లను ఎదుర్కొంటూ పాకిస్థాన్ బ్యాటర్లు క్రీజులో కదలకుండా నిలబడుతున్నారని, ఫ్రంట్ ఫుట్‌ను ముందుకు తీసుకెళ్లడం లేదని అన్నారు. ధైర్యంగా ఆడాలంటే ముందుగా అవసరమైన ప్రతిభ ఉండాలని పేర్కొన్నారు.



# కుల్దీప్ బాల్‌ను లైట్ తీసుకున్నాడు.. తర్వాత ఏం జరిగిందో చూసి బ్యాటర్ షాక్!

- కుల్దీప్ బౌలింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్
- బంతిని వదిలేసిన జమాన్ అక్తర్‌కు షాక్
- అనూహ్యంగా తిరిగి స్టంప్స్‌ను తాకిన బంతి
- ఎసెక్స్‌పై కుల్దీప్‌కు 10 వికెట్లు
- ఇంగ్లాండ్ వికెట్ల ప్రత్యేకత వివరించిన కుల్దీప్

ప్రజాక్షేత్రం



టీమిండియా స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఇంగ్లాండ్ కౌంటీ క్రికెట్‌లో తన స్పిన్ మాయాజాలాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ సీజన్‌లో యార్క్‌షైర్ తరఫున ఆడుతున్న కుల్దీప్ ఇటీవల ఎసెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి అదరగొట్టాడు. తాజాగా అతడు వేసిన ఓ బంతి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బ్యాటర్ బంతిని వదిలేయగా.. అది అనూహ్యంగా మలుపు తిరిగి స్టంప్స్‌ను గిరాటేసింది.

కౌంటీ ఛాంపియన్‌షిప్ డివిజన్ 1లో ఎసెక్స్‌తో ఈ నెల 10న ముగిసిన మ్యాచ్‌లో కుల్దీప్ తొలి ఇన్నింగ్స్‌లో 4/70, రెండో ఇన్నింగ్స్‌లో 6/50తో సత్తా చాటాడు. మొత్తంగా 10/120తో మ్యాచ్‌లో 10 వికెట్లు తీసుకున్నాడు. బ్యాటింగ్‌లోనూ 36 పరుగులు చేశాడు. కుల్దీప్ అద్భుత ప్రదర్శనతో యార్క్‌షైర్ ఇన్నింగ్స్ 106 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

ఇక వైరల్ అవుతున్న వీడియోలో జమాన్ అక్తర్‌ను కుల్దీప్ బోల్తా కొట్టించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆఫ్‌స్టంప్‌కు చాలా దూరంగా కుల్దీప్ బంతిని పిచ్ చేశాడు. బంతి ఆఫ్ స్టంప్ బయటకు వెళ్తుందని భావించిన జమాన్ దాన్ని ఆడకుండా బ్యాట్ ఎత్తేశాడు. కానీ బ్యాటర్ ఊహకు అందని విధంగా బంతి పిచ్ అయిన తర్వాత లోపలికి భారీగా తిరిగింది. నేరుగా స్టంప్స్‌ను తాకడంతో జమాన్ షాక్‌కు గురయ్యాడు. చేసేదేమీ లేక పెవిలియన్‌కు చేరాడు.

మ్యాచ్ తర్వాత కుల్దీప్ మాట్లాడుతూ.. బౌలింగ్‌కు వికెట్ చాలా అనుకూలంగా ఉందని చెప్పాడు. బంతిని వేగంగా వేయాల్సిన అవసరం లేదని, వికెట్‌లోనే మంచి పేస్ ఉందని వివరించాడు. బంతిని పిచ్ చేసిన తర్వాత అందులో వేగం కనిపించిందని, ఎక్కువ రివల్యూషన్స్‌తో స్పిన్ చేయడమే కీలకమని తెలిపాడు.

భారత్‌లో పరిస్థితులతో పోలిస్తే ఇంగ్లాండ్ వికెట్లు పూర్తిగా భిన్నంగా ఉంటాయని కుల్దీప్ చెప్పాడు. స్వదేశంలో ఎక్కువగా స్పిన్ లభించినా పిచ్‌లు నెమ్మదిగా ఉంటాయని, బ్యాటర్లు అందుకు తగ్గట్టుగా సర్దుకునే అవకాశం ఉంటుందని వివరించాడు. ఇంగ్లాండ్‌లో వికెట్లలో వేగం ఉండటంతో బ్యాటర్ బ్యాక్‌ఫుట్‌కు వెళ్తే ఇబ్బందుల్లో పడతాడని చెప్పాడు. అందుకే ఫ్రంట్‌ఫుట్‌పై ఆడాల్సి ఉంటుందని, అప్పుడు క్యాచ్ ఔట్, స్లిప్, షార్ట్ లెగ్‌లో క్యాచ్ కొట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించాడు.

కుల్దీప్ భారత్ తరఫున ఇప్పటివరకు 19 టెస్టులు ఆడి 80 వికెట్లు తీశాడు. ఈ ఫార్మాట్‌లో ఐదు సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించాడు. అయితే ఇటీవలి కాలంలో జాతీయ జట్టులో తుది జట్టులో చోటు దక్కించుకోవడంలో అతడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు.

# అరంగేట్రంలోనే రికార్డు మోత.. పాక్ ఆటగాడు రజావుల్లాకు ఇంగ్లీష్ ప్రేక్షకులు స్టాండింగ్ ఓవేషన్..

- ఇంగ్లండ్‌తో టెస్టులో పాక్ అరంగేట్ర బౌలర్ రజావుల్లా విధ్వంసం
- కేవలం 63 బంతుల్లో 9 సిక్సర్లతో 81 పరుగులు
- టెస్టు అరంగేట్రంలోనే పాక్ తరఫున ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డు
- ఇన్నింగ్స్ ఓటమి నుంచి పాక్‌ను గట్టెక్కించిన అతని కీలక ఇన్నింగ్స్
- షార్ట్ బాల్ అంటేనే నాకిష్టం అని వ్యాఖ్యానించిన యువ పేసర్

ప్రజాక్షేత్రం




క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మ్యాచ్ ప్రతి ఆటగాడికి చిరస్మరణీయం. కానీ, పాకిస్థాన్‌కు చెందిన 21 ఏళ్ల యువ పేసర్ రజావుల్లా తన తొలి టెస్టును ఎప్పటికీ మరిచిపోలేని విధంగా మలుచుకున్నాడు. బౌలర్‌గా జట్టులోకి వచ్చి, బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఆఖరి టెస్టులో ఓటమి అంచున నిలిచిన పాకిస్థాన్‌ను తన అద్భుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. కేవలం 63 బంతుల్లో 9 సిక్సర్లు, 81 పరుగులతో ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ ప్రదర్శనకు ఎడ్జ్‌బాస్టన్ స్టేడియం మొత్తం నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) అభినందించింది.

మూడో రోజు ఆటలో పాకిస్థాన్ ఇన్నింగ్స్ ఓటమి దిశగా సాగుతున్నప్పుడు రజావుల్లా 9వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్ వంటి ఇంగ్లండ్ మేటి పేస్ బౌలర్లను ఏమాత్రం భయపడకుండా ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా పాక్ టాప్ ఆర్డర్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన షార్ట్ బంతులనే లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లు ఆడాడు. ఈ క్రమంలో కేవలం 43 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టెస్టు అరంగేట్రంలో పాకిస్థాన్ తరఫున అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ ఇదే కావడం విశేషం.

ఈ మ్యాచ్‌లో మహమ్మద్ అబ్బాస్ (42)తో కలిసి రజావుల్లా 121 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ ఇద్దరి పోరాటంతో పాకిస్థాన్ 449 పరుగుల స్కోరు చేసింది. తన అద్భుతమైన ఇన్నింగ్స్ పై రజావుల్లా మాట్లాడుతూ.. "ప్రేక్షకులు నిలబడి చప్పట్లు కొడుతుంటే చాలా ఆనందంగా అనిపించింది. నేను జీవితాన్ని ఆస్వాదించాలనుకుంటాను. నాకు షార్ట్ బాల్ అంటే చాలా ఇష్టం. దేశం కోసం ఆడుతున్నప్పుడు భయపడాల్సిన అవసరం లేదు. నాపై నాకు నమ్మకం ఉంది. అందుకే సానుకూల ఫలితం వచ్చింది" అని తెలిపాడు. అరంగేట్రంలోనే అద్భుత శతకం చేసేలా కనిపించినా, రజావుల్లా ఆ మార్కుకు 19 పరుగుల దూరంలో ఔటయ్యాడు. అయినప్పటికీ, అతని పోరాట పటిమ క్రీడా ప్రపంచాన్ని ఆకట్టుకుంది.

# సిరాజ్ చేతికి హైదరాబాద్ పగ్గాలు.. రంజీలో అసలు పరీక్ష!

- హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా సిరాజ్ ఎంపిక
- చామా మిలింద్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు
- అక్టోబర్ 11న త్రిపురతో హైదరాబాద్ తొలి మ్యాచ్
- ఎలైట్ గ్రూప్-బిలో హైదరాబాద్
- కెప్టెన్‌గా రంజీలో సిరాజ్‌కు కొత్త సవాలు

ప్రజాక్షేత్రం

రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌కు హైదరాబాద్ జట్టు కొత్త ఉత్సాహంతో సిద్ధమవుతోంది. భారత స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు జట్టు పగ్గాలు అప్పగించింది హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ). 202627 సీజన్‌లో హైదరాబాద్‌కు సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. చామా మిలింద్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో త్రిపురతో హైదరాబాద్ తలపడనుంది. హైదరాబాద్ ఎలైట్ గ్రూప్ బిలో ఉంది. సౌరాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అసోం, త్రిపుర ఈ గ్రూపులో ఉన్నాయి.

ఇటీవల శ్రీలంక పర్యటనలో సిరాజ్ ఆశించిన స్థాయిలో వేగం చూపలేకపోయాడు. సాధారణంగా గంటకు 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేసే అతడు.. అక్కడ 120 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడు. రెండు మ్యాచ్‌ల్లో 44 ఓవర్లు వేసి నాలుగు వికెట్లు తీసుకున్నాడు.

రెండు నెలల విరామం తర్వాత నేరుగా మ్యాచ్ ఆడటంతో తన బౌలింగ్ లయ దెబ్బతిన్నట్లు సిరాజ్ తెలిపాడు. రన్‌అప్‌లో అడుగులు సరిగ్గా పడకపోవడంతో వేగం తగ్గిందని చెప్పాడు.

దులీప్ ట్రోఫీ ఫైనల్లో మాత్రం సిరాజ్ తిరిగి లయ అందుకున్నాడు. శ్రీలంక నుంచి వచ్చిన కొన్నిరోజులకే చెన్నై మ్యాచ్ ఆడినా.. దేశం తరఫున ఆడేటప్పుడు సాకులు చెప్పకూడదని స్పష్టం చేశాడు. జట్టు కోసం పూర్తి స్థాయిలో కష్టపడటమే తనకు ముఖ్యమని చెప్పాడు. ఇప్పుడు హైదరాబాద్ కెప్టెన్‌గా సిరాజ్ ముందు మరో సవాలు ఉంది. నాయకత్వంతో పాటు బంతితోనూ సత్తా చాటేందుకు అతడికి రంజీ సీజన్ మంచి అవకాశం కానుంది.





నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది ప్యారడైజ్'. బ్లాక్‌బస్టర్ హిట్ 'దసరా' తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న భారీ చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో కాయదు లోహర్, సోనాలి కులకర్ణి, లెజెండరీ యాక్టర్ మోహన్ బాబు, రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ, స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24న ఈ సినిమా థియేటర్లలో విడుదల కాబోతోంది. అయితే సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్నప్పటికీ ఇప్పటివరకు ట్రైలర్ విడుదల కాకపోవడం నెట్టింట చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో తాజాగా, చిత్రబృందం ఒక ప్రెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ వేడుకలో పాల్గొన్న నాని సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటూ అందరికీ బిగ్ షాక్ ఇచ్చారు. 'ది ప్యారడైజ్' సినిమాకు ఎలాంటి ట్రైలర్ ఉండదని ఆయన స్పష్టం చేశారు. అత్యున్నత నాణ్యతతో కూడిన సినిమాను ప్రేక్షకులకు అందించడానికి చాలా టీమ్‌లు నిరంతరం కష్టపడుతున్నాయని తెలిపారు.

విడుదలకు తక్కువ సమయం మాత్రమే ఉండటంతో ట్రైలర్ కంటే సినిమా అవుట్‌పుట్‌పైనే తమకు పూర్తి శ్రద్ధ ఉందని, తప్పనిసరి పరిస్థితుల్లోనే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని నాని వివరించారు. సినిమా విడుదల తేదీ రెండుసార్లు మారడంతో కాస్త సంకోచం కలిగిన మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. కానీ అభిమానులు చూపిస్తున్న అపారమైన మద్దతు తమ బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. కేవలం సమయభావం కారణంగానే ట్రైలర్‌ను విడుదల చేయలేకపోయామని స్పష్టం చేశారు. అయితే కేవలం టీజర్ చూసిన తర్వాత చాలామంది ఇది కేవలం ఒక హింసాత్మక యాక్షన్ చిత్రం మాత్రమేనని అనుకోవచ్చని నాని అభిప్రాయపడ్డారు. కానీ 'ది ప్యారడైజ్' అనేది కేవలం హింసతో కూడుకున్నది కాదని, ఇదొక అందమైన తల్లి కొడుకుల అనుబంధం పైన, దాని వెనుక ఉన్న బలమైన భావోద్వేగాలపైనా దృష్టి పెడుతుందని నాని తెలిపారు. సినిమా విడుదలైన తర్వాత అసలు కథ ఏంటో థియేటర్లలో చూసి అందరూ ఎంజాయ్ చేస్తారని నాని చెప్పుకొచ్చారు.

## అభిమానుల మద్దతు మా బాధ్యతను మరింత పెంచింది..

# రామ్‌తో సంయుక్త

రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందిస్తున్నారు. కృష్ణ పోతినేని నిర్మాత. ఇందులో సంయుక్త కథానాయికగా నటిస్తోంది. ఈ విషయాన్ని శుక్రవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇదో విభిన్నమైన నియో-నోయిర్ సైకలాజికల్ థ్రిల్లర్. రామ్ ఇందులో వీర అనే శక్తిమంతమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో అలరించనున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి సామ్ సీఎస్ సంగీతమందిస్తుండగా.. తిరునావుక్కరసు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇక మరోవైపు సంయుక్త పుట్టినరోజు సందర్భంగా 'స్వయంభూ', 'స్లమ్ డాగ్', 'హైందవ', 'ది బ్లాక్ గోల్డ్' చిత్ర బృందాలు ఆమె కొత్త ప్రచార చిత్రాలు విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపాయి.



# వెంకటేష్ 'ఆదర్శకుటుంబం' టీజర్ వచ్చేసింది..




విక్టరీ వెంకటేష్ హీరోగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శకుటుంబం' నుంచి టీజర్ వచ్చేసంది. 'డబ్బుకి సబ్బుకి ఓ పోలిక ఉంది.. మొదటిది చూస్తుండగా కరిగిపోతుంది., రెండోది ఆలోచించేలోపే అరిగిపోద్ది' అంటూ వెంకటేష్ డైలాగ్‌తో స్టార్ట్ అయిన ఈ టీజర్‌లో.. కూర, సాంబారు చేశాను అని వెంకటేష్ అనడగా.. పప్పు చెయ్యలేదా అని శ్రీనిధి అడుగుతుంది. దీంతో వెంకీ.. నువ్వు అందినచోటల్లా అప్పు చెయ్యి నేను అప్పు చేస్తాను' అంటూ వెంకీ మామా ఫ్రస్టేషన్ కనిపిస్తుంది. 'అడుక్కునే వాళ్లకైన ఆదివారం ఉంటుంది కానీ, ఈ అప్పులోలికి మాత్రం ఉండదు.. నాకు ఫ్యామిలీ ఈమేజ్ ఉందని తెలుసు.. కానీ సిట్యుయేషన్ డిమాండ్ చేస్తే యాక్షన్ చెయ్యడానికి వెనుకాడను' అనే డైలాగ్స్ టీజర్‌లో హైలెట్‌గా నిలిచాయి. మొత్తంగా ఈ టీజర్ చూస్తుంటే.. శ్రీనిధి అప్పులు చేసే భార్యగా.. వెంకటేష్ బ్యాంక్‌లో జాబ్ చేస్తున్న బాధ్యత కలిగిన భర్తల కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కాగా.. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం అక్టోబర్ 2న రిలీజ్ కాబోతున్నది. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, నారా రోహిత్, నివేథా పేతురాజ్, యువినా పార్థవి, రాజా ప్రైవల్ తదితరులు



దాదాపు మూడు దశాబ్దాల పాటు బాలీవుడ్‌లో కొనసాగుతూ 50కి పైగా సినిమాల్లో నటించిన ప్రముఖ నటి ప్రీతి జింటా.. గత కొద్ది రోజులు ఇండస్ట్రీకి కాస్త దూరం అయ్యారు. ఇప్పుడు ఓ యాక్షన్ కామెడీ మూవీ 'వైబ్'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో ప్రీతి జింటా మేడమ్ హెచ్ అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో నటిస్తున్నారు. వంశిక ధీర్ అనే కొత్త అమ్మాయి ఇండస్ట్రీకి పరిచయం అవుతుండగా, ఆమెతో పాటు కునాల్ కెమ్ము, స్పర్ష్ శ్రీవాస్తవ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబర్ 18న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో నటి వంశిక ధీర్ తన సినిమా అనుభవాలను పంచుకున్నారు.

పోస్టర్‌లో తనను తాను చూసుకొని ఆశ్చర్యపోయానని, ట్రైలర్ లాంచ్‌లో పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు తనకు కొద్దిగా ఇంపాస్టర్ సిండ్రోమ్ అనిపించిందని, ఈ భావన ఇంకా పోలేదని తెలిపారు. వంశిక మాటలతో ఏకీభవించిన ప్రీతి జింటా, ఇండస్ట్రీలో ఇన్ని సంవత్సరాలు పనిచేసినప్పటికీ ఏ పాత్రనైనా చేసేటప్పుడు చేయగలనా? లేదా అనే సందేహం ఎప్పటికీ ఉంటుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా తాను తెరపై తన సినిమాలను ఎప్పుడూ చూసుకోలేనని, తన నటనను తాను ఎప్పుడూ సరిగ్గా అంచనా వేసుకోలేనని ప్రీతి చెప్పారు. సినిమా పూర్తయిన తర్వాత ఆ సినిమాను చూడలేనని, థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా అనిపిస్తుందని అన్నారు. మూవీ చూస్తున్నప్పుడు ఇది ఇంకా బాగా చేసి ఉండాల్సింది అనే ఆలోచనలు వస్తుంటాయని ఆమె తెలిపారు.

## నా సినిమాలు చూసుకునేందుకు చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది

# ఫుల్ స్వింగ్‌లో 'సంబరాల ఏటిగట్టు' పనులు.. బాక్సాఫీసు వద్ద మెగాస్టార్‌తో పోటీ తప్పదా?



మెగా హీరో సాయిదుర్గా తేజ్, టాలెంటెడ్ డైరెక్టర్ రోహిత్ కేపీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'సంబరాల ఏటిగట్టు'. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అయితే, సరిగ్గా అదే సమయంలో జనవరి 13న మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మూవీ 'కాకా' కూడా రిలీజ్ కానుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో బాక్సాఫీస్ వద్ద మామ అల్లుళ్ల మధ్య పోటీ ఖాయమని, లేదా 'సంబరాల ఏటిగట్టు' వెనక్కి తగ్గుతుందని ప్రచారం జరిగింది. ఈ ఊహాగానాలన్నింటికీ మేకర్స్ తాజాగా ఫుల్‌స్టాప్ పెట్టారు. తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ, ఈ సినిమా డబ్బింగ్ పనులను అధికారికంగా ప్రారంభించారు. స్టూడియోలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ అప్‌డేట్‌తో పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశకు చేరినట్లు స్పష్టమైంది. అనుకున్న తేదీకంటే ముందుగానే షూటింగ్ పనులు పూర్తి చేసి.. జనవరి 12న కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు చిత్రబృందం ప్రయత్నాలు చేస్తోంది. ఒక రోజు గ్యాప్‌తో ఇద్దరు మెగా హీరోలు బాక్సాఫీస్ వద్ద తలపడబోతుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.

*"బిడ్డ పుట్టడం వల్ల జీవితం మారిపోతుందని అందరూ చెబుతారు. నేను ఆ మార్పుని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాన"ని అంటోంది కథానాయిక సమంత. ఇటీవలే 'మా ఇంటి బంగారం' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆమె.. త్వరలో తల్లి కాబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సమంత తన జీవితంలోని కొత్త దశ గురించి ఆసక్తికరమైన సంగతుల్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. "తస్సాదియ్యా' పాట చిత్రీకరణలో గర్భవతినని తెలిసింది. ఆ సమయంలో కొంచెం అనారోగ్యంగా ఉన్నప్పటికీ చిత్రీకరణని కొనసాగించాం. ఇప్పడా సందర్భాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నా సహజంగానే కుదిరినట్లు అనిపిస్తుంది. బిడ్డ పుట్టడం 'మీ జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది' అని అందరూ చెప్పే మాటను నేను నిజంగా నమ్ముతాను. దానిని ఆస్వాదించడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. వృత్తి పరంగా కొంత కాలం విరామం తీసుకున్నప్పటికీ నా శరీరం చెప్పే దానిపైనే దృష్టి పెడతాను. బాధ్యతల నుంచి పూర్తిగా తప్పకోవడం లేదు. మా నిర్మాణ సంస్థలో కొత్త ప్రతిభని ప్రోత్సహిస్తూ.. మరెన్నో చిత్రాలు రాబోతున్నాయి. వాటికి అవసరమైన సమయాన్ని కేటాయిస్తూనే అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటాను. భవిష్యత్తులో కూడా బలమైన మహిళా ప్రాధాన్య పాత్రలు కలిగిన చిత్రాలొస్తాయి" అని చెప్పింది.*

## ఆ మార్పునకు సిద్ధంగా ఉన్నా!



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.